# కవితా కౌముది - 2010



శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 62

## *ఈ కవితలు 2010 కౌముది సంచికలలో ప్రచురించబడ్డాయి*


| | | |
|---|---|---|
| వసంతాల 'వన్ కె రన్' | వారణాసి నాగలక్ష్మి | 1 |
| ఆర్.టి.సి | కృష్ణ అక్కులు | 2 |
| ఇదేనా? | ఉదయకళ | 4 |
| నీ పిలుపులు | నరేన్ | 5 |
| తువ్వాలు | మాకినీడి సూర్యభాస్కర్ | 5 |
| నువ్వు - నేను | విజయభాస్కర్ | 6 |
| నీ ప్రేమ | పెరుగు రామకృష్ణ | 7 |
| ఆ కన్నీళ్ళే | ఎమ్.వి.వి.ఎన్.సౌమ్య | 8 |
| కాలంతో పోటీ | మాధవ్ దుర్భా | 9 |
| ప్రణయగీతం | గరిమెళ్ళ నాగేశ్వరరావు | 10 |
| హృదయం | గన్నవరపు నరసింహమూర్తి | 11 |
| ప్రకటన | ఎస్. ఆర్.బందా | 12 |
| మనసుకు రెక్కలొస్తే | విజయ చావలి | 12 |
| మలిబాల్యం | ఎ.విజయకుమార్ | 13 |
| నీ విలువ | గరిమెళ్ళ నారాయణ | 15 |
| రేకులు రాలిన ఎర్ర గులాబి | కె.క్యూబ్ వర్మ | 16 |
| ఈడేరిన కోరిక | డా.కడియాల వివేకానందమూర్తి | 18 |
| ఆగమనం | చంద్రహాస్ | 18 |
| రెండు చేతులు | అనంత్ మల్లవరపు | 19 |
| ఆవేశాలు - అనుభూతులు | రాళ్ళపల్లి రామసుబ్బారావు | 21 |
| తొలిపదం | సి.హెచ్.నాగభూషణరావు | 21 |
| నీ నవ్వుకోసం | సుజ్జి | 22 |
| 50 వ మైలు రాయి | వెంకటశాస్త్రి | 23 |

| | | |
|---|---|---|
| తను | తమస్విని | 24 |
| ఓ చలిపొద్దు | తులసీమోహన్ | 24 |
| రెండు ప్రేమతీరాలు | ఎమ్వీ రామిరెడ్డి | 25 |
| అందమైన ఉగాది | తాటిపాముల జయమాల | 27 |
| కోరిక | నారాయణ గరిమెళ్ళ | 28 |
| కాలానికి గాలం | తాటిపాముల మృత్యుంజయుడు | 30 |
| నీస్నేహం | ప్రగతి | 31 |
| శాంతి | ప్రతాప వెంకట సుబ్బారాయుడు | 31 |
| మరణం లేని పాట | యశస్వి | 32 |
| వీడిపోయిన వసంతాలు | ఉమ ఇయ్యుణ్ణి | 33 |
| వృక్షాలు కమ్మని చెప్పండి | కలశపూడి శ్రీనివాస రావు | 35 |
| వింగ్స్ | కోసూరి రవి కుమార్ | 37 |
| అమ్మ ముచ్చట్లు | రాళ్ళపల్లి రామసుబ్బారావు | 39 |
| ప్రణతులు | సుమిత్ర | 40 |
| అతడు కలకంటున్నాడు | జాన్ హైడ్ కనుమూరి | 41 |
| సన్నాయి తాత | శ్రీనివాస ఫణికుమార్ డొక్కా | 42 |
| నేను | నచకి | 42 |
| నిను వినా | మానస చామర్తి | 43 |
| వీడ్కోలు నేస్తమా | శ్రీకుమార్ | 44 |
| బాల్యాన్ని పాతరేసిన చోట | జ్వలిత | 45 |
| ప్రయాణం | రాగద్వీప | 46 |
| నేను | డా.ఎన్.కిశోర్ కుమార్ | 47 |
| ప్రకృతి | సన్నిహిత్ | 47 |
| మ్యూజియంలో పెళ్ళి | డా.రమణ యశస్వి | 48 |


| | | |
|---|---|---|
| శతాబ్దివెన్నెల | డా.కె.గీత | 49 |
| ఒక బెయిట్(ఎర) చాలు | డా.నారాయణ గరిమెళ్ళ | 50 |
| మిత్రచ్ఛేదం | డా.వైదేహి శశిధర్ | 50 |
| పంద్రాగస్టు | బలివాడ వెంకట్ పట్నాయక్ | 51 |
| నేనెవ్వరు | ప్రఖ్య మధుబాబు | 52 |
| జీవనగీతి | రామడుగు వేణుగోపాల్ | 53 |
| ఒంటరి పుష్పం | కె.విజయభాను | 53 |
| ఆడపిల్ల | పాలపర్తి జ్యోతిష్మతి | 54 |
| ఉత్తరాలా అవి | ఎస్. ఆర్.బందా | 54 |
| ఎదురొస్తావా | రవికిరణం | 55 |
| అక్కడ..మనిషి | భువనచంద్ర | 56 |
| ఒంటరి పయనం | కె.క్యూబ్ వర్మ | 57 |
| సొగసుచూడ తరమా..! | శ్రీకిరణ్ | 57 |
| జీవనపోరాటం | అనంత్ మల్లవరపు | 58 |
| వృద్ధాప్యం | చావలి విజయ | 59 |
| ఒక సగటు రోజు | వేమూరి విజయలక్ష్మి | 60 |
| పిచ్చమ్మ | విప్లవ్ | 61 |
| అరాచకం | ఎన్.ఎల్.శ్రీనివాస్ | 62 |
| మా వూరు | ఆర్.దమయంతి | 63 |
| బుక్కులు | డా.క్రిష్ణ సుబ్బారావు | 64 |
| ఎదురుచూపులు | సి.హెచ్.నాగభూషణ రావు | 64 |
| పడమటి తీరం | నట్టి శివపార్వతి | 65 |
| నశ్వరం | రవి వీరెల్లి | 66 |
| కలలు | రాగద్వీప | 66 |

| | | |
|---|---|---|
| వింగ్స్ | కోసూరి రవికుమార్ | 67 |
| ఎందుకు | ఎస్. ఆర్.బందా | 67 |
| మృదు స్పర్థలు | డా.నారాయణ గరిమెళ్ళ | 68 |
| ఉద్భ్రాంత పాంథుడు | ఎలనార | 69 |
| కనులు - మనసు | కిశోర్ కుమార్ | 69 |
| అమ్మా..నీకు అమ్మగా మారాలని ఉంది | వారణాసి మహాలక్ష్మి | 70 |
| కోరిక | ఉమ చింతలపాటి | 71 |
| చెలీ | స్వాతీ శ్రీపాద | 72 |
| నేటి బతుకు | బి.గీతిక | 73 |
| ఆత్మవేధ | దాసరాజు రామారావు | 74 |
| అందమైన అనుభూతి | ఆచళ్ళ శ్రీనివాసరావు | 75 |
| అవతరణం | టి.శ్రీవల్లీ రాధిక | 75 |
| నా తపన | ఇందిర మందడి | 76 |
| అక్షరం | డా.గంఢ్ర లక్ష్మణరావు | 77 |
| అమ్మ అక్కడే ఉంది | బి.హెచ్.గవాస్కర్ | 78 |
| స్వార్థం | సన్నిహిత్ | 78 |
| హృదయమథనం | విజయ చావలి | 79 |
| సంకెల | కె.క్యూబ్ వర్మ | 80 |
| జీవితం | జె.బి.వి | 80 |
| చెట్టు మెట్టు | న్యాయపతి వెంకటమణి | 81 |

కవితా కౌముది

# వసంతాల 'వన్ కె రన్ '

వారణాసి నాగలక్ష్మి




గతం గాయాల గేయమై
కాలానికి గాలమేస్తుంటే
ముందుకి సాగలేక ఆగిపోయా!
రేపటికోసం ఇంద్రధనుసు రంగుల్లో
నిన్నరాత్రి కన్న కలలేవీ కనిపించక
అదే పనిగా వెతుక్కున్నా!
కాగితపు పడవలెక్కి
రేపటి తీరానికి ప్రయాణమైన నా కలలన్నీ
తెల్లారక ముందే ముంచెత్తిన జడివానకి తడిసి
నా గుమ్మం పక్కనించే కొట్టుకుపోతూ
కనిపించాయి!
గమ్యం తాలూకు ఊహా చిత్రాలెన్నో
గదిగోడల నిండా వేలాడుతూ ఉండేవి..
అవన్నీ ఏవీ!?
ఉండబట్టలేక ఇల్లంతా తిరిగేశా
ఉన్మాదినై ఆకాశమంతా వెతికేశా
గాలిపటాలై ఎగరబోయి
ఎండుకొమ్మలకి చిక్కుకుపోయిన ఊహలన్నీ
చివికి చిరిగి కనిపించాయి..
నిస్పృహ నిలువెల్లా ఆవరించినా



నిలబడక తప్పదు, నడవకపోతే గడవదు!

ఎదురుగా చేరాల్సిన 'టార్గెట్స్' భయపెడుతున్నాయి!

ఓ సరదా ప్రేమకథకి వస్తువు కావాలి వెంటనే

అనురాగ రాగంలో ఒదిగే ఉల్లాసగీతం కావాలి తక్షణమే!

గడువు దాటిపోతోంది..

ఆత్రంగా అసహనంగా వీధిలోకి అడుగులేశా

వసంతాలు 'వన్ కె రన్' లో పాల్గొంటూ కనిపించాయి!

ఆ కళ్ళలో రాత్రి మెరిసిన నక్షత్రాలన్నీ తళుక్కు మన్నాయి!

వాటి నిండా అంతరిక్షాన్నంతటినీ వెలిగించగల ఆశల తళతళలాడాయి!

ఆ నవ్వుల్లోంచి జారిన మల్లెలతో దారంతా పూలబాటై పోయింది!

ఎంత సుగంధం!

మధుర గేయాలతో నా పుస్తకం నిండిపోయింది!

విశ్వప్రేమ నిండిన నా మనసు దూదిపింజై తేలిపోయింది! ***

## ఆర్ టి సి

కృష్ణ అక్కులు



మీ పల్లెకి వస్తాను

వార్తాపత్రికలు తెస్తాను

అంగళ్ళకు సరకులు

రైతులకు విత్తనాలు

ఎరువులు మోసుకొస్తాను

హారన్ తో పలకరిస్తాను

గార పనిచేసే గురవయ్యను

కూరలమ్మే పాలమ్మను

మటన్ షాపు మస్తానును
టీచర్ శామ్యూల్ ను
స్కూల్ కెళ్ళే చిన్నారులను
కాలేజి కెళ్ళే యువతను
సకాలంలో సవ్యంగా
క్షేమంగా గమ్యం చేరుస్తాను

ఓ తల్లివలె సేవ చేయడం నా కానందం
అయితే ఏ నాయకుడు పోయినా
ఏ రాజకీయ సంక్షోభం తలెత్తినా
ఏ పాపం చేయని నాపై
కసిగా రాళ్ళు రువ్వుతారు
పెట్రోల్ మంటల్లో మసిచేస్తారు
అన్నం పెట్టిన అమ్మచెయ్యి నరకడం
అంటే ఇదేనని తెలిసేనా మీకెప్పటికైనా?

నేను కాలిపోతూ నేల కూలిపోతూ
బేలగా జాలిగా మీ వైపే చూస్తుంటాను
రేపు మీకు ఆధారమెవ్వరని
కన్నీరుకారుస్తూ దిగులుగా ఒరిగిపోతాను
నేను మీ ఆర్టీసీని
మేరెంత 'హర్టు' చేసినా
'హార్టు' తో మీకు
ఆశ్రయమిచ్చేదాన్ని ***

# ఇదేనా

## ఉదయకళ

ఇదేనా మరో ఆ ప్రపంచం
ఇదేనా నవీన ప్రపంచం
ఇదేనా విలాసాల లోకం
ఇదేనా విహారాల నాకం

ఇదేనా విషాదాల కంతం
ఇదేనా వినోదాల ప్రాంతం
ఇదేనా ప్రమోదాల గీతం
ఇదేనా ప్రసూనాల వాతం

పదండంచు చెప్పేవు వేగం
పదండంచు పాడేవు రాగం
పదండంచు పల్కేవు వేదం
పదండంచు చిమ్మేవు నాదం

పదం పాడుతూ వెళ్ళినానే
కదం త్రొక్కుతూ వెళ్ళినా నే
సుధావృష్టి వర్షించ లేదే
ఏదీ నేను కోరింది లేదే

కవీ నీవు వర్ణించినావే
సువర్ణేంద్రలోకాల నెన్నో
అవీ వేళ ఏ చోట లేవే
నవమ్మైన దృశ్యాలు రావే

పొలాలెన్నో దున్నేము మాకో
ఫలాలన్ని సున్నాయె దేఖో
ఇలా భూమిపై ఎన్ని నాళ్ళో
ఇలా భూమిపై కళ్ళ నీళ్ళో

ప్రపంచాగ్నికై ఆహుతిచ్చా
అపేక్షించి  యీా నన్ను నేనే
అపాత్రమ్ముగా నయ్యే  నేమో
ప్రపంచాగ్నిలో మాడిపోయా

దగాపడ్డ తమ్ముణ్ణి నేనే
జిగేలన్న స్వర్గమ్ము లేదే
నగారాల మ్రోగించ నింకా
నిగారాలు కన్పించ వింకా

ప్రకాశాలు లేనట్టి ధ్వాంతం
వికాసాలు లేవీ వసంతం
నకారాల నిండెన్ నిశాంతం
వికారాగ్రహ మ్మీ యనంతం

అవే ఆధులూ వ్యాధులూ మా
కవే బాధలూ గాధలూ మా
కవే చేదు లీ జీవితంలో
భవ మ్మొక్క శాపాల కూపం

కవీంద్రుల్ ఋషీంద్రుల్ ప్రవక్తల్
సువక్తల్-దివిం జూపినా రీ
భువిం జేతిలో నద్దమ్మై, హా
అవన్నీ మరూత్పన్న మిథ్యల్

***

# నీ పిలుపులు నరేన్



**చిరుగాలి పిలుపులు నీవే అనుకున్నా**

నా ఉఛ్ఛ్వాసలో వాటిని చేర్చుకున్నా

నా గుండె గదుల్లో వాటిని నింపుకుంటున్నా

అంతలోనే అవి నీవి కావని - పిల్లగాలి అల్లరి అని తెలిసి

నిశ్వాసలో వాటిని తరిమేస్తున్నా!

అయినా ఆ తుంటరి చిరుగాలి నన్ను మాయచేస్తూ

క్షణానికో ఆట పట్టిస్తున్నా

ఏ ఒక్క క్షణంలో నైనా

అవి నీ పిలుపులు కాకపోతాయా అని భారంగా శ్వాసిస్తున్నా!

# తువ్వాలు మాకినీడి సూర్యభాస్కర్

**జిడ్డెక్కి నల్లబారిన అలసటని**

బహు సున్నితంగా

తుడిచేసి

తాజా మొహాన్ని ఆవిష్కరిస్తుంది-

జేబు తువాలు!

రోజంతటి నిర్విరామ కార్య కలాపాలతో

చీకటిగా పేరుకున్న

నిశ్శబ్ద నిశ్చైతన్య

స్తబ్దతని

బహు సున్నితంగా తుడిచేసి..

మరుసటి జీవనోత్సవాన్ని

నిరుపమానంగా వెలిగిస్తుంది ప్రకృతి -

ఏ రహస్యపు జేబులో దాస్తుందో..

వెలుతురు తువ్వాలు! ***

# నువ్వు నేను | విజయ భాస్కర్

పున్నమి రాత్రి అందంగా అమరిపోయిన వెన్నెలవి నీవు
ఉదయిస్తున్న వెలుగులో నన్ను నేను వెతుక్కునే చీకటిని నేను

రాలిపోయిన పూలని చూసి నువ్వు కంట నీరు పెట్టుకుంటావు
నేను జ్ఞాపకాల్ని కూడా త్రొక్కుకుంటూ ముందుకెళ్ళిపోతుంటాను

మాటలన్నీ మనసులోనే దాచుకుని..పెదవులపై చిరునవ్వుని వెలిగిస్తావు

నీ మౌనంలో వినిపించని ఆ అపస్వరాన్ని నేను
ఆ చిరునవ్వులో దాగుండిపోయిన కల్మషాన్ని



నింగిన వెలిగే హరివిల్లువి నీవు..
నీ రంగుల్ని కలిపేసుకునే కెరటాన్ని నేను
ఆ కనుచూపు మేరలో మన కలయిక అబద్ధం

జ్ఞాపకాలు..ఆశలు..అనుభూతులు..అవే నీ అస్తిత్వం..
నాకు ఈ క్షణమే ముఖ్యం.. నాకు నా గెలుపు లక్ష్యం..

నీకు ప్రేమను పంచడమే తెలుసు..అదే నీ ఆనందం..జీవితం..
నా ఆనందం కోసం ప్రేమను వెతుక్కుంటాను..నేను

వింతల్లా..ఆ పైవాడు మనిద్దరినీ ఒకే దేహంలో బంధించాడు..
పుట్టినప్పుడు నాలో అంతా నువ్వే..
నేను మెలమెల్లగా పెరిగి నిన్నూ ఆక్రమించుకున్నాను.

నువ్వు నా నీడవి కాదు.. నాలో మిగిలి వున్న వెలుగువి..
నేను..నీలో దాగుండిపోయిన బలహీనతని..చీకటిని

నా గెలుపు నీ ఓటమి కాబోలు..

కానీ నువ్వు గెలవాలంటే..నేను మిగలకూడదు..

మరణం "మన" జీవితానికి ముగింపు కావొచ్చు..
కానీ నీకు అంతమనేదే లేదు..నాకు తెలుసు..!! ***

## నీ ప్రేమ పెరుగు రామకృష్ణ , నెల్లూరు

నిప్పు, నీరు, గాలి
పొదిగిన నీవు సంపూర్ణం..
సముద్రాన్ని చూసినప్పుడల్లా
నీ సౌందర్యమైన రూపం తెలుస్తుంది!
ఒక భీకర తుఫాన్ను
వీక్షించినప్పుడల్లా..
నీ ముఖంలో రంగులు స్పష్టమౌతాయి..
అందమైన శుభోదయాన్ని
తిలకించినప్పుడు
నేను ప్రేమించాల్సిన ముఖం, కళ్ళు
నాకు బోధపడ్తాయి..
అప్పుడు భూమి మొత్తం
సంతోషంతో పులకిస్తుంది..!
*బెంగాలి-ఆంగ్ల మూలం: విప్లవ మాజీ, మిడ్నాపూర్*
***

# ఆ కన్నీళ్ళే

ఎమ్.వి.వి.ఎన్.సౌమ్య, గన్నవరం

ఆనంద బాష్పాలూ..కన్నీళ్ళూ..
ఎంత తేడా రెంటికీ!?
విజయాన్ని వడేసి పట్టుకున్నప్పుడు
కళ్ళనుండి దొర్లిన ముత్యాలు నీళ్ళే!
కష్టం నీడలా వెన్నంటే ఉంటే
కన్నులు విడిచే పాము కాట్లు కూడా నీళ్ళే!
ఎంత తేడా ఈ రెంటికీ!?
ఆనందంలో వచ్చే నీళ్ళు
అవే ..ఆనంద బాష్పాలు
అందరినీ ఇనుమడింప చేస్తే -
కష్టంలో వచ్చే కన్నీళ్ళంటే
అందరికీ ఈసడింపే !
కానైతే మాత్రం
సంతోషం, ఆనంద బాష్పాలతో పాటూ
ఎంతో మందిని చుట్టూ చేర్చినా..
దుఃఖంలో సానుభూతితో మన దగ్గరకు వచ్చేవి
మనం ఈసడించుకునే ఆ కన్నీళ్ళే!
మన దుఃఖ భారాన్ని తగ్గించేవీ ఆ కన్నీళ్ళే!!

***

# కాలంతో పోటీ

మాధవ్ దుర్భా

**వడివడిగా సాగే కాలానికి**
ఆనకట్టలు కట్టే నన్ను చూసి
రోజూ  వచ్చిపోయే నన్నేం చేస్తావని
మబ్బుల్లో దోబూచులాడాడు సూరీడు!
అరచేతిని అడ్డుపెట్టి అరుణోదయాన్ని ఆపేసి
 సూరీడు పని పడదామన్న నా కోపం చూసి
మరి నా మాటేమిటనేసి
వెక్కిరిస్తూ  పరిభ్రమించింది కాలచక్రం..!
కాలచక్రాన్ని నిర్లక్ష్యం చేస్తున్న నన్ను చూసి
ప్రశ్నించింది "వచ్చే ఏళ్ళా? పోయే ఏళ్ళా?" అని
నెరిసిన నా జుత్తు చూసి నవ్వుతూ నిలువుటద్దం!
జుత్తుకి రంగంటించి కాలాన్ని వెనక్కి తిప్పేసానని
ఇప్పుడేమంటావని ప్రశ్నిస్తుంటే అద్దాన్ని,
"వీలైతే మమ్మల్ని పట్టుకుని ఆపెయ్" అని
పోటీ పడ్డాయి చిన్న ముల్లూ, పెద్ద ముల్లూ!
గడియారంలో బేటరీ తీసేసి
ఊపిరి పీల్చుకుంటున్న నన్ను చూసి
"నెల మారింది పేజీ మార్చెయ్" అనేసి
గదమాయించింది గోడకున్న కేలెండరు!
వచ్చీపోయే ఋతువులూ, వద్దన్నా ఆగని సూరీడూ
వలస వెళ్ళే పక్షులూ, వికసించే పూలూ,
అన్నీ నన్ను ప్రశ్నిస్తున్నాయ్!
"ఎందుకీ తపనా?..ఏమిటీ ప్రయాసా?" అంటూ!
నడుస్తున్న కాలాన్ని ఆపేసి ఈ క్షణాన్ని ఆస్వాదిస్తానన్న నన్ను చూసి
నింగిని తాకే కెరటాలూ..నిప్పుని అంటే శలభాలూ..
దాహం తీర్చే ఎండమావులూ..చంద్రుడిలో కుందేలూ..
"మేమున్నాం నేస్తం నీకు తోడు.." అంటూ ధైర్యాన్నిస్తున్నాయ్!

***

# ప్రణయగీతం

గరిమెళ్ళ నాగేశ్వరరావు, విశాఖ

నంద నందనా ఇది.. నా హృది బృందావనమున నీకై..
పూచిన పరువపు మరువపు పరిమళమ్ములే..!
నీ తనువు అణువణువున..జల్లుకు..అల్లుకు..పరవశించనీ..!!

నీ మురళీ రవమున పలికిన స్వరముల జతలో
అందెను నేనై సందడి చేసే ఆనందములో
అంతరంగమే, అంకితమయ్యే..కీర్తనకిది నా నర్తనలే..!

గోవర్ధనగిరి నెత్తికెత్తుకుని..గోవులు కాచిన లీలల వేళల
నలిగిన నీ కరమును..తలచిన నా మది తల్లడిల్లెరా..
మెత్తగ హత్తుకు ఒత్తి చూడనీ..నా ఎదపై..సేద తీరగా..!!

కాళియ మర్దన తాండవ కేళిలో కందినవేమో..
కదిలి కదిలి నీ చరణయుగములు.. నా మదినదిలో
అడుగిడి..కడిగి..స్వాంతన పొందుము..ఒక పరి స్వామీ..!!

పూతన చన్నుల పూసిన విషము..అణిగీ అణగక..
దాగినదేమో..అధరము మాటున..
నా పెదవులలో సుధలు గ్రోలుతూ పరిహరించనీ..మనసారా..!!

పడమటి కొండల పానుపు పైనా..సప్తాశ్వాల స్వప్నసీమలో
వెన్నెల వెలుగై రేగిన కన్నె వలపిది..కాదనబోకుర..
వేకువ వేళకి ప్రణయ జగతిలో ప్రేమ కాంతినే ప్రసరిద్దాం..!!

***

# హృదయం

డా.గన్నవరపు వరాహ నరసింహ మూర్తి

సీసం. కొండ కోనను గొట్టి గండ శిలను దెచ్చి
కూళ చెక్కిన యట్టి గుండు రాయొ
ఇనుప లోహము దెచ్చి యింధనమున గాల్చి
మూస పోసిన యట్టి మొద్దు రాయొ
వజ్రశిలను గోసి వాలు లెన్నియొ దీర్చి
వక్ర చిత్తుడు సేయు వంపు రాయొ
అగ్గి కొండల నుంచి యల్ల నల్లన బాఱి
చల్ల బడిన యట్టి నల్ల రాయొ

తే.గీ. జీవ రాశుల యందు నే శ్రేష్ఠు డనెడి
మనిషి కెట్టుల నయ్యెనో మాయ దారి
గుండె కాదుర నద్దియు గుండు గాక
కఠిన చిత్తులఁ జేరిన గట్టి రాయి !

(విజయవాడ చిన్నారి నాగవైష్ణవి దారుణ హత్య గురించి చదివాక)

***

## ప్రకటన

ఎస్.ఆర్.బందా



**తల విదిలించి తన నుదుటి మీద గుప్పెడు చెమట చుక్కలు**

తెరుచుకున్న మనసులో విరుచుకున్న రెక్కలు
వెచ్చదనం చుట్టుకుని మరింత కాగిన ఆలోచనల రసయాత్రలు!
మూసుకున్న కళ్ళనుంచి జారే కన్నెప్పలు
కామేష్టిలో కరిగి మండిన కపోలాల మీద గోళ్ళు
చివరికో గుక్కెడు తాదాత్మ్యం తలకెక్కించుకుని తన
నల్లని కళ్ళలోకి ముడతల మడతల్లోకి లావాలా జారడం..
కసితో ఖంగున ధ్వనించే గుండె గోడల పరస్పర వైరుధ్యం
నలిగి వొడిలి కరిగిన సాయంత్రపు సౌకుమార్యం..
కామేశ్వరీ వొల్లదు..మళ్ళీ కెరటమూ పగలదు..
ఎందుకంటే
ఆరినతడీ - సంధించిన శస్త్రమూ
సమాన దైన్యచిత్రాలు కనుక..!

***

## మనసుకు రెక్కలొస్తే

విజయ చావలి



**మనసుకు రెక్కలొస్తే ..-**
వూహల కూపిరి పోసి
కళ్ళెం లేని గుర్రంలా పరుగులు తీస్తుంది,
తలపుల తలుపులు తెరిచి
పురివిప్పిన నెమలిలా నాట్యం చేస్తుంది.
వయసుకి ప్రాణంపోసి
చెంగుచెంగున హరిణిలా గెంతులేస్తుంది,
కనుల కవాటాలు మూసి

ఆలోచనా సంద్రంలో చేపలా పరవళ్ళు తొక్కుతుంది,
వినువీధిని విహరించే
విహంగమై పరిభ్రమిస్తుంది,
మది విన్యాసాలు హృది విహారాలు
వర్ణనాతీతం!
మది వూయలలూగినప్పుడు
చెక్కిన ఊహా శిల్పాలు
కార్యసాధనలో ఒక్కోప్పుడు
చరిత్ర కారకాలౌతాయి!
మదిలో మెదలిన సృజనాత్మక శక్తి
అనంతమై, అపారమై, సాకారమై
ప్రళాయాగ్నుల విషవలయమై
విలయం సృష్టించవచ్చు..
జన సంచయ సుందర సౌభాగ్య
రమ్య హర్మ్యమై అలరించవచ్చు..!!

***

## మలిబాల్యం

ఎ.విజయ కుమార్

**వయసుడిగిన** జీవితాన్ని నెమరేసుకుంటే
ఆశావాదికి రెండు బాల్యాలు.
నిరాశావాదికి ఒకటే బాల్యం
ఒకటి కొలవగలిగే మూల్యం
వేరొకటి కొలతకందని అమూల్యం

పుడమి తల్లి పొత్తిళ్ళలో
పొదగబడిన నా మాతృమూర్తి సంరక్షణలో
పురుడు పోసుకుంది ఓ మూల్యం
కొలవగలిగే తొలి బాల్యం

ఒడిదుడుకుల ఒత్తిళ్ళలో
ఒదగ బడిన నా అనుభవసారమూర్తి పోషణలో
పురుడు పోసుకుని ఎదిగింది
నా మలి బాల్యం
కొలతకందని అమూల్యం

మనసు తలుపులు తెరుచుకోని తరుణం
కన్నుల బాసల పలకరింపుల కిరణం
విస్పష్టతకి లోటు లేని చూపుతో
కనిపించినదే ప్రపంచంగా
రూపుదిద్దుకొన్న చీకటి స్మామాజ్యం
నా మూల్యమైన బాల్యం

హద్దుల తలుపులు తెరుచుకుని
స్పష్టంగా మంచి చెడుల మధ్య తేడాలు
తెలుసుకోగలిగే దృష్టితో
ఏమీ తెలియని తనంలోంచి
బయటకి బలవంతంగా లాగి
చీకటి స్మామాజ్యంలో వెన్నెల ప్రసరింప చేసింది ఈ అమూల్యం

బోసినవ్వులు ఆనందానికి బొటాబొటి మార్కులని
సిరిసిరి మువ్వల చిరునవ్వులే సంతృప్తికి చిహ్నమని
నేర్పింది నా అమూల్యం

ప్రపంచమంతా నా కోసమే పుట్టిందని భావించింది
నా మొదటి బాల్యం
ప్రంపంచం కోసమే నేను పుట్టానని కనువిప్పు కలిగించింది
నా రెండో బాల్యం

ద్విపాదలక్షణాన్ని మరచి ధారపడుతూ
అదే మహారాజ లక్షణమని మురిసేలా మై మరిచేలా చేసింది
నా మొదటి బాల్యం

పరాన్నజీవనం పరమావధి కాదని
నిజవ్యక్తిత్వమే పరమవీరచక్రమని
నిజం తేల్చి చెప్పింది నా రెండో బాల్యం

తరచి తరచి చూస్తే......
ఈ రోజుకి నిన్న బాల్యం
రేపుకి ఈ రోజు బాల్యం
ఈ జీవన వారధిలో నిన్న మనల్ని నేటిలోకి బలవంతంగా నెట్టేస్తే
ఈ నేడు అనుభవాల సారాన్ని మూటగట్టి రేపటికి అప్పజెప్పి
మళ్ళీ కొత్త బాల్యం లోకి నెట్టేస్తుంది
అందుకే....
తిరిగిరాని బాల్యం కన్న
కొలవగలిగే మూల్యం కన్న
నిత్యనూతన యవ్వనమైన మలిబాల్యం
కొలత కందని అమూల్యమంటేనే ఇష్టం!!

**

## నీ విలువ

నారాయణ గరిమెళ్ళ



**నువ్వంటే నువ్వే.**
నా కళ్ళల్లోకి కళ్ళు పెట్టి చూసి,
నిశ్చింతగా, నిర్భయంగా మట్లాడే నువ్వే...
నిన్ను నా కళ్ళతొ చూసి
నీతో కబుర్లు కలబోసి
నీ అపదమస్తకాన్ని చిరునవ్వుని చేసి
పులకరించి పలకరించాక,
ఇంక నువ్వు నువ్వేనని నిర్ధారించుకోవడమెందుకు?

ఏ చెంచాగాళ్ళొ నిన్ను నాముందు ఆడిపోసుకున్నంత మాత్రాన,
దుమ్మెత్తి పోసినంతమాత్రాన,
నీ విలువ మారదు.
ఐనా అంత సులువుగా మారి పోయే
ఊసరవెల్లి లాంటి విలువ నీకు మాత్రం ఎందుకు!?
తుమ్మితె ఊడి పోయే ముక్కు లాంటి విలువని
నీకు అంట గట్టే వాళ్ళెవరైనా కనబడితె
వాళ్ళని కూడా ఒక్కసారి గట్టిగా తుమ్మేసై.
ముక్కు చీదినట్టె,
వాళ్ళని వాళ్ళ విలువని విదిల్చికొట్టు.

నీకు నువ్వే విలువ
నీ నవ్వే విలువ
కళ్ళల్లోకి కళ్ళు పెట్టిచూస్తూ, సూటిగా మాట్లాడగలిగె
నీ స్పష్టతే నీ విలువ.
తల ఎత్తి లోకాన్ని చూసె నీ తెగువే నీ విలువ.
నిటారుగ నిలబడె నిలువెత్తు నువ్వె నువ్వే గొప్ప విలువ.

***

# రేకులు రాలిన ఎర్ర గులాబీ

కె..క్యూబ్ వర్మ



మీరు రోజూ తాగి పారేసే సిగరెట్ల ఖర్చులో
అరశాతమైనా ఈ బొచ్చెలో వెయ్యి బాబూ!
మీరు ప్రతిక్షణం మీ సెల్‌తో పలకరించే
మీ శ్రేయోభిలాషి కాల్ ఖర్చులో
అరవంతయినా ఇలా విదిలించేయి బాబూ!
రంయ్యిన మీ గర్ల్ ఫ్రెండ్‌తో హోండాపై దూసుకుపోయే
పెట్రోల్ ఖర్చులో ఒక చుక్క విలువైనా ఇలా విసిరేయి బాబూ!
సిగ్నల్ లైట్ వెలిగి ఆరిపోయే లోపు
నేను వేసే ఈ పిల్లిమొగ్గలను లెక్కపెట్టగలవా?

ఈ చక్రంలోంచి దేహాన్ని మెలికలు తిప్పిన
నా నేర్పరితనాన్ని ఒక్కసారి చూసావా?
ఈ తాడుపై నా నడక నైపుణ్యాన్ని ఒక మారు పరికించావా?
మీరు తినిపారేసే కాగితపు పొట్లాలలో
మిగిలింది ఏరుకోడానికి నేనిపుడు
ఒక అంతర్రాష్ట్ర యుద్ధాన్నే చేయాలి!
రైలుబండిలో మీ సీట్ల కింద బుగ్గిని చొక్కాతో
తుడిచిన పిలగాడిని నేనే!
పేవ్‌మెంట్ పక్కన మీ బూట్లకు మెరుపునద్దింది నేనే!
మీ ఎంగిలి ప్లేట్లు కడిగి కడిగి
మీరు తిన్న బల్లలను ఊడ్చిఊడ్చి
నా చేతి వేళ్ళు ఊరిపోయి
చేపపిల్లలా తెల్లగా పాలిపోయాయి!
ఖాకీ బాబులకు నెలవారీ కేసుల లోటు తీర్చేది నేనే
రక్తం రుచి మరిగిన ఈ తెల్లపులుల మధ్య
ప్రతిక్షణం వేటాడబడుతున్నాను!
ఏ తల్లి చేసిన పాపానికో మీ పుణ్యమూర్తుల
లోకాన ఉమ్మివేయబడ్డాను..
నా యీ పాపిష్టి జన్మకు విముక్తి లేదెందుకో!?
నా కెవరిమీదా అసూయలేదు బాబయ్యా
మీరు మీ పిల్లలంతా కోటు జేబులకు
ఎర్రగులాబీలను గుచ్చుకోండి!
నేనీ రాతిరి ఈ అమావాస్యచీకటిలో
ఈ రైలు పట్టాపక్కన నిశీధి సంగీతాన్ని
ఈ విరిగిన వేణువుతో ఆలపిస్తాను!

***

## ఈడేరిన కోరిక డా.కడియాల వివేకానంద మూర్తి

**ఏళ్ళ తరబడి** మైళ్ళు నడిచాను
ఎన్నాళ్ళో యెదురుచూస్తూ యెండా వానల్లో తడిసాను
యెదలో సుందరి యెదురుపడాలని !
కష్టం నష్టపడలేదు..కలలు చిందర వందర కాలేదు
ఆనక మేనకలా మెరిసిందామె
నా సగము జగము తానై నిలిచిందామె !
నిన్నటి మైళ్ళూ యెండలూ వానలూ
భూమాతలో వొదిగి పోయాయి
ఈ నరుడికి లేదు మరే కోరికా! ***

## ఆగమనం చంద్రహాస్

**దారి** ప్రక్కన కరడు గట్టిన
హిమపు  రాశులు మాయమాయెను
ఉదయ వేళల మహిక మెరసెను
మంచు ముత్యపు సరులతో!

ఎముక కొరికే చల్లగాలులు
మందగించెను మరలిపోయెను
సోలి సాగెను పిల్ల తెమ్మెర
పులకలెత్తగ భూతలం!

నిదురవోయిన మోడువారిన
తరులు లేచెను కనులు తెరచెను
క్రొత్త చిగురుల నేతలల్లెను
లేత పచ్చని కోకలన్!

పగలు పెరిగెను రజని ఒదిగెను
వేడి హెచ్చెను హాయినిచ్చెను
అంతలోనే ముసురు క్రమ్మెను
మట్టి తడిసెను వానలో!

సూత్రధారుడె చిత్రకారుడు
ఇంద్రధనసులె వన్నె కుంచెలు
పొంగి పూచెను పూల పొదలే
రంగురంగుల హంగులన్!

శిశిర రథమ్ము సాగి పోయెను
శోభలీనే లేత ఆమని
జగతి విరిసెను ప్రకృతి మురిసెను
మధురమాయెను మాయగా!!

# రెండు చేతులు — అనంత్ మల్లవరపు

**ఒక చేత కత్తి,** ఒక చేత డాలు పట్టి
యుద్ధం చేసినవీ రెండు చేతులు
ఓం శాంతి శాంతి శాంతి అంటూ
తథాగతునిలా తాదాత్మ్యం  చెందినవీ రెండు చేతులు



దగుల్బాజీ దద్దమ్మలకు,
స్వార్ధ పూరిత రాజకీయ విషపురుగులకు
జై కొట్టినవీ రెండు చేతులు
జై జవాన్, జై కిసాన్, జైహింద్ అంటూ
దేశభక్తిని చాటినవీ రెండు చేతులు

కర్తవ్య నిర్వహణలో కార్యోన్ముఖుడినై
కాయకష్టం చేసి కడుపు నింపినవీ రెండు చేతులు
మనసిచ్చిన మనిషిని
బాహు బంధంలో బంధించినవీ రెండు చేతులు

దౌర్జన్యాలు దాష్టీకాలు
దుర్మార్గాలు చేసినవీ రెండు చేతులు
బండ రాయిని పిండి కొట్టి
ఉలితో శిలగ మార్చినవీ రెండు చేతులు

అల్లరి చేసే పెంకి పిల్లవాడిని
శిక్షించినవీ రెండు చేతులు
అల్లారు ముద్దు గారాల పట్టికి
గోరు ముద్దలు పెట్టినవీ రెండు చేతులు

పరిచయంలేని వ్యక్తిని
తొలి హస్తబంధనంతో
పాతమిత్రుని చేసినవీ రెండు చేతులు
నా దేశ సంస్కృతిని ' నమస్తే 'గా
నలుదిశలా చాటి చెప్పినవీ రెండు చేతులు

ముకుళిత హస్తాలతో
జోడించి నమస్కరించి ప్రార్థిస్తున్నా!
నాలోకి నేను జారి పోతున్నా!
ప్రపంచ శాంతిని జారవిడవ కన్నా!



***

## ఆవేశాలు - అనుభూతులు     రాళ్ళపల్లి రామసుబ్బారావు

**జనజీవన స్రవంతిలో సంగీతం**
పాటగ మారే మాటల బాటన సాహిత్యం
విడిపోని విడదీయలేని జంట
అనుభవాల అనుభూతుల పసిడి పంట

మాటలు పాటలుగ మారిన గీతాలు
స్వరాలు లయలుగ కూడిన హొయలు
శృంగార స్వరార్చనతో తరించిన క్షేత్రయ
పాటల ఆలంబన పరవశించిన త్యాగయ

మాటలకు లొంగని అనుభవాలు ఆవేశాలు
అందుకొని అందించే సంగీత సౌరభాలు
సంగీతం పొందికైన మాటల తోరణం
పాటల రెక్కల హొయిగ విహరించే విహంగం

సంగీత సాధన సప్తస్వరార్చన
భక్తి భావము ముక్తికి సోపానము
అమరిన మాటల అందం సంగీతం
సారస్వత రస సిద్ధిని అందించే సాహిత్యం ***

## తొలిపదం     సి.హెచ్.నాగభూషణరావు

**తొలి చినుకు**
పుడమి తల్లిని పులకింపజేస్తుంది
పచ్చదనాన్ని అందిస్తుంది

తొలి అడుగు
సుదీర్ఘ ప్రయాణానికి నాంది అవుతుంది
గమ్యానికి దగ్గర చేస్తుంది

తొలిమాట
అమ్మ పిలుపుతో మొదలౌతుంది
అభిమానానికి మూలమౌతుంది

తొలిపైసా
సంపాదనకు పునాది వేస్తుంది
అష్ట ఐశ్వర్యాలకు మొదటి మెట్టు ఔతుంది

తొలిప్రేమ
మనసులని కలుపుతుంది
మమతలను పంచుతుంది

అందుకే.. తొలిపదం ప్రతి అక్షరం.. సువర్ణాక్షరం..!! ***

# నీ నవ్వు కోసం సుజ్జి

**ఒక తీరికైన సాయంత్రం నీతో కలిసి**
మంచు వర్షాన్ని సంబరంతో చూసిన జ్ఞాపకం మనసులో మెదిలింది.
నువ్వూ - నేనూ, మన మధ్య పెరిగిన దూరం,
మిగిలిన అగాధం లాంటి మౌనం..
అన్నీ తలపుకి వచ్చి అయోమయంలో ఉన్న సమయాన..
నా అరచేతిలో నీ స్పర్శ జాడ వెతుక్కుంటున్నా!
నువ్వు నన్ను వదిలి వెళ్ళావని నీమీద కోపమెంత పెంచుకున్నానో గానీ..
నీ నవ్వు మొహమైనా గురుతు లేదిప్పుడు!
ఒక్కసారి నీ చిరునవ్వు నిండిన మోము కలగందామనుకుంటే..

ఎనెన్ని రాత్రులు నీ కలవరింతలో గడపాలో మరి! ***

## 50 వ మైలురాయి

వెంకట శాస్త్రి

**ఐదు దశాబ్దాలు నిండిన తరుణం**

అర్ధ శతాబ్దపు శరవేగం
ఎందరో మహానుభావులు, అందరికి వందనాలు.
తనువు నిచ్చిన తల్లి, తన పేరు నిచ్చిన తాతగారు,
నీతి నేర్పిన నాన్న గారు, తోడుగా పెరిగిన తమ్ముళ్ళు,
తోడూ నీడగా ఉంటానంటూ వెంట వచ్చిన భార్య,
చదువు నేర్పిన గురువులు, సేద తీర్చిన తరువులు,
మిన్ను విరిగి మీద పడ్డప్పుడు వెన్ను తట్టి నిలబెట్టిన మిత్రులు.
పుట్టుకొచ్చిన పిల్లలు, నెట్టు కొచ్చిన ఏళ్ళు.
ఏబది ఏళ్ళ ఏకరువు, ఎన్నో అనుభవాల బరువు,
మరెన్నో అనుభూతుల నెలవు.
కాశీ మజిలీ కథల్లాంటి మజిలీలు,
తప్పొపుకుంటూ తీసిన గుంజీలు.
పబ్లిక్‌గా చేసిన పకపకలు, ప్రైవేటుగా తడిపిన దిళ్ళు.
అనుకోకుండా అందివచ్చిన సువర్ణావకాశాలు కొన్ని,
అందని ద్రాక్షపళ్ళు ఎన్నో.
సునాయాసంగా సాధించిన విజయాలు కొన్ని,
కేవలం ఆయాసాన్ని మిగిల్చిన్న ప్రయాసలు మరికొన్ని.
తీరాలు దాటి వచ్చేసినా మారని తీరులు,
దూరాలు పెరిగినా మాయని మమతలు.
నడచి వచ్చేసిన దారి కనిపిస్తుంటే బహు నాజూకుగా,
చేరాల్సిన గమ్యం అనిపిస్తుంటే బహు దూరం,
నే నిలబడి ఉన్నా 50 వ మైలు రాయి దగ్గర,
జ్ఞాపకాలు నెమరేస్తూ, వాస్తవాలు గుర్తిస్తూ. ***

## తను

**తమస్విని**

**నా బాధలకి** తను ఓదార్పవుతుంది
నా సంతోషంలో తను చిరునవ్వు!
నా ఆకలికి తను వంటిల్లవుతుంది
నా ఆలోచనలకి తను శ్రోత!
నా అనారోగ్యానికి తను ఔషధమౌతుంది
నా సమస్యలకి తను పరిష్కారం!
నా ఆవేదనకి తను కన్నీరవుతుంది
నా ఆందోళనకి తను ఉపశమనం!
నా మలి సంధ్యలో తను చేతి కర్రవుతుంది
కొడిగట్టిన జీవితానికి చిరుదివ్వె!
నేను మృత్యువు ఒడిలోకి జారినప్పుడు
తను నిలువెత్తు దుఃఖమౌతుంది
నా మరణానంతరం తనలో నేను!
నా భౌతిక రూపానికి తను రెప్లికా
నా భావాలకి తను స్పందన!
నా గుప్పెడు గుండెకి తను భగవంతుడిచ్చిన కొండంత అండ
అవును తను నా కూతురు!! ***

## ఓ చలిపొద్దు

**తులసీమోహన్**

**మెత్తని** పచ్చికలో
ఆకుపచ్చని మోహం ...
చలికాలం తాలూకు ఆఖరి జ్ఞాపకాలు,
రాత్రిని కలవరపెట్టిన కవితలు
అటుగా వెళ్ళినట్టు!

వెన్నెల వేకువ కలిసినట్టుందేమో,
వాగు వయ్యారానికి
పొగమంచు
సాంబ్రాణి అద్దుతుంది

ఒంగిన ఓచెట్టుకొమ్మ
ఊగకుండా నవ్వాలనుకుంటుంది
అంచుల్ని కలిపే
స్నేహగీతంలా... చిన్ని వంతెన!
గాలివాటానికి వచ్చిపడే
పూలన్నిటినీ
ఒడిలో చేర్చుకుంటుంది

సర్ది చెబుతుందో, సమర్థిస్తుందో గానీ
ప్రవాహంలోకి పంపకాలు
జరుగుతూనేవున్నాయి

వాడిపోయి ఓ ఒడ్డుకు చేరేలోగా
ఎన్ని తాజా అధ్యయనాలు
ఎన్ని సజీవచిత్రాలు
మలుపులు తిరుగుతూ,
మెలికలు వీడుతూ...! ***

# రెండు ప్రేమ తీరాలు

ఎమ్వీ రామిరెడ్డి

విశ్వవిద్యాలయం వీధుల్లోనే
ఒక సన్నని గీత దగ్గర నువ్వు ఆగిపోయావు
గీతకు అటువెళ్ళాలో ఇటు వెళ్ళాలో

అర్థం కాక, కొంత సమయం
రెక్కలు టపటపలాడించావు
చివరికి గీత దాటుతూ దాటుతూ
ఒక ప్రేమగీతాన్ని గుండెలకు హత్తుకున్నావు
ఇద్దరూ కలిసి ఇసుకతిన్నెల మీద నడుస్తూ
సముద్రాన్ని చెరిసగం పంచుకున్నారు
వర్షం కురిసి వెలసిన రాత్రి
నీటిబొట్లు చెమ్మగిలే చెట్లకింద నిలబడి
గంటల తరబడి కబుర్లు పంచుకున్నారు

^^^

చదువు పూర్తయినా ప్రేమ పూర్తికాలేదు
ఉద్యోగంకన్న ఉద్వేగంలోనే
కాలాన్ని కాల్చుకుతిన్నావు
గీతంలోని సంగీత సారాంశం
అర్థం కాకముందే హఠాత్తుగా గాయపడ్డావు
రోజూ ఎస్సెమ్మెస్ ఇచ్చినట్లే
గంటకోసారి మిస్డ్ కాల్ ఇచ్చినట్లే
ఇ-మెయిల్‌లో ముద్దుల ఎటాచ్‌మెంట్లు పంపినట్లే
తాపీగా ఆమె తన శుభలేఖను నీ చేతుల్లో పెట్టింది
సముద్రం ఉప్పొంగి నిన్ను లోపలికి లాక్కెళ్ళింది
ఆకాశం అమాంతం నెత్తిన కూలింది.
నువ్వు చలించలేదు
అలాగని నీలో చలనమూ లేదు
ఆమెకోసం కనుగుడ్డుకీ కనురెప్పకీ మధ్య
కత్తులవంతెన నిర్మించుకున్నావు
ఒక్కో అవయవాన్నీ తెగనరుక్కున్నావు
నీ మిత్రులూ తల్లిదండ్రులూ చూస్తూ ఊరుకోలేక
ఆక్సిజన్ సిలిండర్లు తెచ్చి నీ మొహానికి తగిలించారు
మోటుగా వాటిని విసిరికొట్టి
తెలియని భాషలో కేకలు పెట్టావు

^^^

చిత్రంగా నీ బాధలకొలిమిని

మరో నేస్తం ఆర్పింది
ఆమె నీతో కలిసి షికార్లు చేయలేదు
వ్యాహ్యాళిగీతాలు పాడలేదు
సముద్రతీరాన విహరించలేదు
సముద్రన్నే నీలో నింపింది
సూర్యోదయాల్ని నీ కళ్ళల్లో వెలిగించింది
మనసులో మొక్కలు నాటింది
చెట్టులా నీకు అండగా నిలిచింది
ఆమెనీడలో నీకు జ్ఞానోదయమయ్యింది
ఆకాశంలోంచి భూమ్మీదకు దిగావు
సముద్రంలోంచి సమూహంలోకి
అలలా వ్యాపించావు
శరీరం నిండా కళ్ళు తొడుక్కున్నావు
శిఖరారోహణ మొదలైంది
నీ చేతిలోని జెండా గర్వంగా తలెత్తింది

మీ అమ్మానాన్నలు
నిన్ను ఆప్యాయంగా గుండెలకు హత్తుకున్నారు
చిత్రంగా నీ కళేబరం నిండా
మనిషి చర్మం మొలిచింది
అప్పుడు తెలిసింది
నీకు ప్రేమ విలువ..!!

***

## అందమైన ఉగాది — తాటిపాముల జయమాల

**మావిడాకుల పచ్చదనంతో**
మల్లెపూల సువాసనలతో
కోయిలరాగాలను ఆలపిస్తూ
కవి మనసును కదిలిస్తూ
పేరులో ఏముందిలే అని

అలవాటుగా ముస్తాబై అదిగో వచ్చేస్తున్నది అందమైన ఉగాది
నాగరికుల ఆతిధ్యం నామోషీగా స్వీకరిస్తూ
పైమెరుగుల పేరంటం మొహమాటంగా అందుకుంటూ
విరవీగిన రాజకీయ ప్రగల్భాలను విదిలించుకుంటూ
గుంభనంగా, నిశ్శబ్దంగా నగరాలను దాటి ఇదిగో వచ్చేస్తున్నది అందమైన ఉగాది
పచ్చని పొలాలలో శ్రమించే హృదయాలను
మచ్చిక చేసుకుందామని
కల్లలెరుగని పల్లెజీవితాల్లో కలకాలం ఉండిపోదామని
స్వచ్ఛమైన గాలుల్లో, నాట్యమాడే చేలల్లో
సౌభాగ్యం పండించాలని
పల్లెపడుచుల కన్నుల్లో
వెలుగు కాటుకలద్దాలని
పండిపోయిన బతుకుల్లో, శూన్యమైన రైతుల గుండెల్లో
పండువెన్నెలలు నింపాలని
పేరులో ఏముందని... అందమైన పేరంటాలై
ఆత్రంగా, ఆదరంగా అందరిని పలకరిస్తూ
కవిమనసుని కదిలిస్తూ
అలవాటుగ, అలవోకగ ఇదిగో రానే వచ్చింది ఉగాది
వికృతి నామ సంవత్సరానికి ఆది ***

(వికృతి నామ సంవత్సర ఉగాది పర్వదినాన బే ఏరియా ప్రవాసవాణి రేడియో కేంద్రంలో చదివిన కవిత)

## కోరిక — నారాయణ గరిమెళ్ళ

**ఆకుపచ్చని**
అనాగరికమైన అడవుల్లోనైనా
అడవుల్లోని మృగాల్లోనైనా
మృగాల అమాయకపు చూపుల్లోనూ
వాటి క్రౌర్యమైన ఆకల్లో సైతం
నాకు జీవమే కనిపిస్తుంది.

నదీ నదాల్లో
వాటి ప్రవాహాల్లో
ప్రవాహాలకీ ఎదురీదే
జలచరాల్లో
జలచరాల సమూహాల్లో
జీవం తొణికిసలాడే
మెరుపుచాలు
నన్ను కట్టి పడేస్తుంది.

కానీ,
సమాజాలు మసలె
కాంక్రీటు కీకారణ్యాల్లో
నగరాల ధగధగల్లో
కాసుల గలగలల్లో
కార్ల మోటారు రణగొణ ధ్వనుల్లో..
కాలంతో పోటీ పడే
ఉరుకుల పరుగుల్లో
ఎంత వెదికినా
జీవం ఛాయలు లుప్తమై పోయిన
అనుభవమే మిగులుతోంది.

ఒక్కసారి,
జీవాన్ని కోల్పోతున్న ఎడారుల్లో
అడవులన్నీ విత్తనాలు జల్లి
నదులన్నీ నీళ్ళు చిలకరిస్తే బాగుండు!
రెక్కలూ, రేకులూ మొలిచి
పుడమంతా పునరుత్తేజమయ్యేందుకు
ప్రతిచోటా జీవం తొణికిసలాడేందుకు***

# కాలానికి గాలం

## తాటిపాముల మృత్యుంజయుడు

నిన్నటి విరోధి, నేటి వికృతి
వెన్నంటే వస్తుంది రేపటి ఖర
ఉగాది ఉత్సవం ఇలా గిరి తిరుగుతుండ
పూర్తవునుగదా షష్టికాలం చూస్తుండగ

కాలం పుట్టిందెపుడని తలంపు కలిగెను నాలో
దానికి కొలమానం ఏమిటని ప్రశ్నించితి లోలో
కాలానికి రూపం తుదిమొదలు తెలియని చక్రమా?
అంతం తెలియని ప్రవాహమా?
పంచాగం వేత తీసివేతల అంతరంలో
సాముమవిద్యలా సాగే మనిషి జీవనగమనమా?

కాలం కొలత ఘడియ విఘడియ, యుగ మహాయుగాలా?
సొలుపెరుగక గడియారం కొట్టే
ఎద దడ పుట్టించే టిక్ టిక్ శబ్దాలా?
కాలమంటే... అలుపెరుగని గుండె లయ
లబ్ డబ్ ల మధ్య విరామమేమో!
నిరంతరం విస్తరించు
విశ్వంలో జరిగే ఘటనల సమాహారమేమో!

'కాలాన్ని కొంత కాలం ఆపుదాం' అనడం అవుతుంది ఒక Paradox
నడిచే వాచీని ఆపితే కాలం
ఆదా అవుతుందనుకోవడం ఒక పెద్ద Haox

వెళ్లండి, విహరించండి అంతరిక్షంలో విహంగాల్లా
అక్కడ కాలం కుంటుతూ నడుస్తుందట
ఎంచక్కా యవ్వనాన్ని ఎక్కువ కాలం ఎంజాయ్ చెయ్యొచ్చు

అన్నట్టు... ఈ మాయాజాలంలో పడి కాలాన్నే మరిచాను
అదిగో వచ్చేస్తున్నట్టున్నది మరో ఉగాది
ఇంకో కవితాపుష్పాన్ని తయారుచేయాలి మరి ***

(వికృతి నామ సంవత్సర ఉగాది పర్వదినాన బే ఏరియా ప్రవాసవాణి రేడియో కేంద్రంలో చదివిన కవిత)

## నీ స్నేహం

ప్రగతి

నీ స్నేహమాధుర్యం
ఉవ్వెత్తున లేచే జ్వాలాముఖి లాంటి దుఃఖాన్ని
ఉపశమించే శీతల రుతుపవనం!
నీ స్నేహ పూరిత దృక్కులు
ఉరకలేసే బడబాగ్నిని
చల్లార్చే నును లేత అలల జలతారు!! ***

## శాంతి

ప్రతాప వెంకట సుబ్బారాయుడు

సర్వ మానవాళి సమానత్వమని
వసుధైక కుటుంబమని
వట్టి మాటలెందుకు?
అవసరమైన సహాయం
అణా పైసా తీసుకోకుండా చేసినప్పుడు
నీవుండే వీధిని నీ ఇంటిగా పరిగణించినప్పుడు
నీ పక్కవాడికి నీవు ఆత్మీయుడవైనప్పుడు
అదే. మార్పుకి శ్రీకారమౌతుంది,
విశ్వమానవ కళ్యాణానికి నాంది గీతమౌతుంది!
మార్పన్నది మాంత్రికుడి కర్రతో వచ్చేది కాదు
నిద్రలో కల కనేది కాదు
చేయీ చేయీ కలపడం

అందరూ ఒకటవటం,
అన్న ఊహే మనకి ఊపిరిపోయాలి!
ఉత్ప్రేరకం కావాలి
అప్పుడే మానవుడు మహనీయుడు
జగమంతా మహాత్ములు..మదర్ థెరిస్సాలే!
యుద్ధమన్నది విగత జీవవుతుంది!
సర్వత్రా - స్వేచ్ఛాయుత కపోతాలే..
శాంతి..శాంతి..శాంతిః!! ***

## మరణం లేని పాట

యశస్వి, గుంటూరు



**పాట** అడ్డంపడి గొంతు పొలమారింది అంతే
కొత్త సిరా తాగితే కోర బోయిన కంఠం
మళ్ళీ రాగాల పల్లకిలో కోయిలమ్మని మోసుకొస్తుంది
పల్లవి గొంతు గొంతులో ప్రవహిస్తూనే వుంటుంది
జీవనదిలో అక్షయ పాత్రలా
అక్షరాల పొదుగులో
రాగాల క్షీరాన్ని పిండి
శృంగార రసాన్ని కలిపి
సినిమా డైరీకి
డైలీ పాటలు పోసిన వేటూరి
తెలుగోళ్ళ గుండె గోడలపై
ఆరేసుకున్న అక్షరాలూ
పారేసుకున్న పదాలు
మళ్ళీ మళ్ళీ వికసిస్తాయి ఆ రోజాలు
మరణం లేని మానస "స్వరో"వరాలు

తెలుగులో
మూర్తీభవించిన రెండక్షరాల పాట
ఘనీభవించిన రెండర్థాల పా(ట)ల సంద్రం
నవతరానికి
"వే" చూపించిన, తెరవెనుక
"టూరి"స్టు సుందరం
రాలిపోయిన పువ్వుకాదు
అజరామర అక్షర యోధుడు
ఆభరణం లేని శంకరుడు ***

## వీడిపోయిన వసంతాలు

**ఉమ ఇయ్యుణ్ణి**

వంగూరి ఫౌండేషన్ వారు నిర్వహించిన ౧౫వ ఉగాది రచనల పోటీలలో ప్రథమ బహుమతి పొందిన కవిత

(ఇది కేవలం కవిత కాదు, సంప్రదాయాల మీద అగౌరవమూ కాదు, వితండవాదమసలే కాదు. ఇటీవలే కొద్దిమంది సన్నిహితుల జీవితాలలో జరిగిన సంఘటనలకు మనసు చలిస్తే వెలువడిన భావ పరంపర)

**బాలార్క కిరణాల పసిడి వెలుగుల వేళ**
శుక్రవారపు పొద్దు పసినిసుగు కనులు విప్పిన వేళ
ఇంటింట వెలసేను శ్రీ మహలక్ష్మి
అపరంజి బొమ్మ అది ముద్దుల గుమ్మ!

కేరింతలిడు వేళ కళకళలు తోచేను
పారాడు పసికూన మనసంత నిండేను
తప్పటడుగుల చిట్టితల్లి తాతలకు పండుగ
చిరునవ్వుల చిన్నారికి బొమ్మ చంద్రహారాలు దండిగ

అట్లతద్ది కన్నియ తోటివారికి చెలియ

కలువ కన్నుల నెలత చిరునవ్వు విరియ
ప్రకృతి మురిసెనమ్మ, సిరులు కురిసెనమ్మ
కన్నతల్లి మనసు పొంగి పొరలెనమ్మ

నట్టింట నడయాడు అపర శారదా దేవి
మెట్టింట అడుగిడ అదె కాద సౌభాగ్యవతి
ఇరుగింటి పొరుగింటి చెలులు కూడిన వేళ
అయినింటి కోడలు పుణ్యాల రాశి!

తగిన సఖుడు తోడ్పడ వికసించు జీవితము
జన్మజన్మల క్రిందట ముడివడిన బంధము
వొడిన చేర పసిబాలుడు సంతరించె మాతృత్వము
వొడిదుడుకుల సమన్వయమున సమకూరె మానసిక పరిపక్వము

గడుచు వసంతాలు, కడతేరు వేసవులు
లెక్కపెట్టలేనన్ని హేమంతా రుతువులు
శిశిర మొచ్చు వేళ లేవు తీరికలు
సంక్రాంతులు సంబరాలు, సంతరించు ఆడంబరాలు

యుగాదుల ఆహ్వానాలు, దీపావళుల ఆర్భాటాలు
పసుపు కుంకుమల వరలక్ష్ములు, పట్టుచీరల దుర్గమ్మలు
మట్టిగాజుల గలగలలు, మట్టెల సవ్వడుల కలకలలు!

బ్రతుకుచక్రపు టిరుసున, చిక్కువడిన చెలికాడు
చరమయాత్రకు సాగువేళ, బ్రతుకులెందుకు మరి శూన్యాలు!?

సారథి వీడిన రథపు పయనాలెటు?
సాగిపోయిన బ్రతుకు మరలి రాదెటూ
సాంప్రదాయపు పేరున సంకెలలదేల
నిన్నటి పుణ్యస్త్రీ, నేడపశకునమేల?

నిన్నటి రంగుల గాజులు నేడు రంగు మాసేన?

నిన్నటి కుంకుమ రేఖ నేడు చెరిగిపోయేన?
నిన్న పసివాడిన మ్రోడు నేడు చిగురులెత్తేను
కాని, నిన్న వీడిన చెలుడు మరలి రాబోడు
కాని స్మృతుల సుగంధాలు భవిత నింపేను
మరి సాంప్రదాయపు తెర మాటున
మనవత ఎటు దాగేను!?

ఆత్మ నిత్యమ్ము, బ్రతుకు సత్యము
మృతి తథ్యము, స్మృతి వరము
సంస్కృతి సంప్రదాయ సిద్ధము
మరి మానసము? మానవతా బద్ధము!

మరుగు పడనివ్వకీ చిన్ని నిజము
చేతనయిన చిందించు ఒక అశ్రు కణము
చేయూత నందింప కాదు బ్రతుకు దుర్భరము
ఏకాంతమయినా, అది భరింప శక్యము

తోవలెన్నయిన కాని, గమ్యమందరి కొక్కటి
ప్రకృతి నేర్పె డు పాఠము నిత్యనూతనము
ప్రతి బ్రతుకు పయనము, కాల నిర్దిష్టము
మానవత్వపు వెలుగు మరుగు పడనీకుము..!! ***

## వృక్షాలు కమ్మని చెప్పండి

కలశపూడి శ్రీనివాస రావు

వంగూరి ఫౌండేషన్ వారు నిర్వహించిన ।5వ ఉగాది రచనల పోటీలలో ద్వితీయ బహుమతి పొందిన కవిత

**నా చిన్ననాటి పెరటి చెట్టు**
చిలకలు వాలే చెట్టు
అన్ని పక్షులని ఆదరించే వృక్షం

పెద్దది, ఎత్తైనది
లోతుగా వేళ్ళూనుకొన్నది
పచ్చనిది, నిండైనది
ఆకుపచ్చదనం విశాలంగా పరచుకున్నది
గట్టిది, గతమెంతో ఉన్నది
శాఖోపశాఖలుగా విస్తరించుకొన్నది

నేటి నా ఇంటిముందు చెట్టు
చిలకలు వాలని చెట్టు
తనని తానూ మరచిన వృక్షం

కొమ్మలు పెరగగానే విరిగిపడి
ఎక్కడెక్కడికో ఎగిరిపోతున్నాయి
కొమ్మలు కొమ్మలైపోతున్నది
వృక్షం నుండి దూరంగా, పరయిగా
తమది కాని నేలమీద
తమని తామూ నాటుకుంటున్నై

బయట ప్రకృతితో యుద్ధం చేస్తున్నాయి
లోని ప్రకృతిని గెలవలేక పోతున్నాయి
వికృతంగా మారుతున్నాయి

లోతైన వేర్లు లేక
నీరందక ఎండిపోతున్నాయి
కాండం శక్తి చాలక
చిన్న చిన్న గాలివానలకే జడిసిపోతున్నాయి
ఉన్న ఆకుపచ్చదనం చాలక
రోజంతా వొళ్ళంతా వంచి కష్టపడున్నాయి

శ్రమకి తట్టుకోలేక వడలి పోతున్నాయి
తోడులేక తల్లడిల్లుతున్నాయి
వంటరితనంతో వణుకుతున్నాయి

పూలు పూయలేక

కాయలు కాయలేక

పళ్ళు లేని ఒక్క మొక్క

తుమ్మెదలు, తేనెటీగలు

పలకరించే పక్షులు

లేక మొక్కవోతున్నది

వృక్షం కాలేక పోతున్నది

దీన్ని చూస్తే

కంటినీరు వెల్లువవుతున్నది

కళ్ళు మూసుకుంటే

మొక్కల మొండేల వనాలు కనిపిస్తున్నాయి

మొక్క అంతరించి పోతుందేమో నన్న బాధ

మెరుపులా తాకుతున్నది పదే.పదే!

ఇలాంటి మొక్కలు మీకూ కనిపిస్తే

మీకు తోచిన సహాయం చెయ్యండి

వృక్షాలు కమ్మని చెప్పండి ***

## వింగ్స్

కోసూరి రవి కుమార్ , దాచేపల్లి

ఫ్లెక్సీ బ్యానరు కడుతూ

కాలు జారింది

నేల కాన్వాసుమీద

కుంచె ఛిద్రమైన చిత్రం

కళలు

ఇక కలే!

......

సమాధి దగ్గర

తలాపి దీపం ఎప్పుడూ సిద్ధమే

చావు తీగల మీద తుపాకితో
దేశభక్తి సర్కస్

సైనికుడు
నిరంతర మృత్యు సహవాసి
....
ఆరుగాలం
శ్రమించి
అరకొరగా
అమ్ముకుంటున్నాడు

రైతుజీవితం
ఆరని చితి!
....
ఒక్కసారి
కోల్పోతే
తిరిగి
తేవటం కుదరదు

కాలం
నేల ఒలికిన అమృతం!
.....
పిట్టగూడు
ప్రిదిలిపోయింది
హరిత రథం
నేలకుంగింది

కోరికా
ఒక కుంపటే! ***

## అమ్మ ముచ్చట్లు

రాళ్ళపల్లి రామసుబ్బారావు, నెల్లూరు

**అపురూపమమ్మ ఆయమ్మకు**
తన పాపాయి ప్రతి ముచ్చట
బోసినవ్వులొలికిస్తూ వూయలలూగినా
ముంగిళ్ళ పై నేలన దోగాడినా
గోడనో మంచం కోడునో పట్టుకుని
బుడు బుడి అడుగులు వేసినా

బంగారు కొండ చిన్నారి తల్లి
వజ్రాల మూట చిట్టితండ్రి
వూఁ కొడితే వుగ్గు గిన్నెలు
పిడికిలి తెరిస్తే ముద్దకుడుములు

పలుకులు పలికితే చక్కెర చిలకలు
బోర్లపడితే బొబ్బట్లు
అడుగులు వేస్తే అరిసెలు
పేరంటాళ్ళు పంచి మురిసే ఆ తల్లులు

ఆ తల్లి చందమామ
మనస్సు వెండిగిన్నె
మమత పైడిగిన్నె
చందమామ రావె..జాబిల్లి తేవే..! ***

## ప్రణతులు

సుమిత్ర

ఏ పుణ్య చరణాలు చేరిన యంతనే
పదునాల్గు లోకాలు పరిఢవిల్లు
ఏ పాద ధూళి సోకిన యంతనే నాదు
తనువెల్ల పులకించి తనివి దీరు
ఏ పద పీఠమున హృది నిల్పగ
ఆనంద సంద్రాన అలలు పొంగు
ఏ పద ద్వయమును ఈ చేత తాకంగ
కరతలమ్మంతయు కాంతులీను

అట్టి నీ పదముల కడకు జేరిన యంత
సకల శుభము లమర సౌఖ్యమిచ్చు
పుణ్య సీమల జని పావనంబ య్యెద
ప్రణయులందుకొనుము పుణ్యచరిత ***

## అతడు కలకంటున్నాడు

జాన్ హైడ్ కనుమూరి

ఒకడు కలకంటున్నాడు
రెపరెపలాడుతున్న
తూనిగల్నో తుమ్మెదల్నో పట్టాలని
వెంటడుతున్న బాల్యపుచేష్టలా
రంగులవైపు పరుగెడుతూ
అందాన్నేదో వెతుక్కుంటూ
అతడు కలకంటున్నాడు

ఒకడు కలకంటున్నాడు
అలసిన దేహంతో
జాము జాముకు కూసే
కోడిపుంజులా నిద్రిస్తూ
మైళ్ళు, సంవత్సరాల వేగంతో నడుస్తూ
తనలోనికో, బయటకో
విధుల్లోకో దేశాల్లోకో
సముద్రల్లోకో, దేశదేశాల్లోకో
రహదారి వెంట
రాల్తున్న గుల్మోహర్ రేకల్లా
అక్షరాలను ఏరుకుంటూ
జీవితాన్ని మంత్రించిన పుష్పంచేసి
కాగితపు మడతల్లో
పుస్తకమై నిలిచిపోవాలని
అతడు కలకంటున్నాడు

ఒకడు కలకంటున్నాడు
ఆహ్లాద దేహంతో
కలకనే వేళ
కళ్ళలో గుచ్చుకుంటున్న
ముళ్ళలాంటి వాస్తవాల మధ్య పడిలేస్తూ
పొడిచే ముళ్ళను నరుకుతూ
గాయపడుతూ
గేయమౌతూ
శతాబ్దాలుగా కూరుకుపోతున్న
బురదవీధుల్లోచి
నల్గురు నడిచే దారికోసం
చూపుడువేలై నిలవాలని
అతడు కల కంటున్నాడు

ఏ కలా లేకుండా
ఎన్ని ఏళ్ళగానో
మోయాలనిప్రయత్నిస్తున్నా
పథకాలు రచిస్తున్నా
ఇప్పుడే ఎదిగొచ్చినవాడు
నగ్నదేహంపై వస్త్రంలా తొడుక్కొని
అడుగులేసే పాదాలకు
పాదరక్షలుగా తొడుక్కొని
క్షణమో అరక్షణమో కాదు
గజమో మైలో కాదు
నిరంతర యానంలోకి
మోసుకెళ్తున్నాడు
నేనే చూస్తూ నిలుచుండిపోయాను ***

## సన్నాయి తాత

శ్రీనివాస ఫణికుమార్ డొక్కా

వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన పోటీల్లో ప్రశంసాపత్రం పొందిన కవిత

"అయ్యవారు మెచ్చు ఆటలెద్దును లేదు
అంత బువ్వ పెట్టు అండలేదు
సంకురాతిరేళ సందె పొద్దుల కాడ
నన్ను మరువకయ్య, కన్న తండ్రి

కన్నుమూసిరయ్య నన్ను సాకిన వారు
నన్ను కనరు నేను కన్న వారు
ఆత్మ బంధువిదియె "అమ్మ" మా సన్నాయి
ఆలి ఇదియె నాకు ఆయువిదియె

ఊపిరందువరకు ఊదుచుందుదు నేను
బాధ మరచిపోదు పాటలోన
"గాలి" గాలి కలసి కట్టె మిగులు వరకు
పాడెనెక్కువరకు పాడుకొందు

ఎదర జెనము, నేను ఎట్టి సన్నాయినై
దీని ఋణము కొంత దీర్చుకొనుదు"
ననుచు గుండె నదిమె నాద బ్రహ్మను తాత
ఏమి బంధమిదియె ఎవరికెరుక!! ***

## నేను

నచకి

వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన పోటీల్లో ప్రశంసాపత్రం పొందిన కవిత

రెండక్షరాల మంత్రాన్ని
ఊహకందని స్వతంత్రాన్ని
కదిలే కలల యంత్రాన్ని నేను!
అసమశరుని చెఱకువింటినీ నేనే.
త్రిపురహరుని కంట మంటనూ నేనే!

శృంగార రస ఝుంఝూటిని,
దేవాలయాన కోనేటిని,
మనో నేత్రాన కన్నీటిని నేను!
గుండెపగిలిన కరిమబ్బులో నేను,
వెల్లివిరిసిన హరివిల్లులో నేను!

కోటిభావాల నిలయాన్ని
ఓటి బంధాల విలయాన్ని,
చేటు సంద్రాల ప్రళయాన్ని నేను!
అనాఘ్రాత కుసుమ మృదుత్వాన్ని నేను,
అహంభావ గరిమ చిరత్వాన్ని నేను!! ***

# నిను వినా

మానస చామర్తి

ఎవ్వరూ లేని సాగర తీరంలో పరుచుకున్న వెన్నెల్లాగా ఏకాంతంలో నీ జ్ఞాపకాలు చుట్టుముడతాయి..
వర్తమానం ఒంటరిదై ముడుచుకుంటుంటే..ఆలోచనలు పసిపిల్లలల్లే బాల్యంలోకి పరుగులెడతాయి..
పందిరి పై దాకా పాకిన సన్నజాజి తీగల్లాగే..నా జీవితంలోని ప్రతి ఘడియా నీ ప్రేమతో ముడిపడి ఉంది
కాలం కౌగిట్లో కరిగిన ఒక్కొక్క క్షణం ..అమ్మా!! ..నీ అనురాగ ధారలలోనే తడిసి ముద్దయిపోయింది..!

ఆటల్లో పడి సమయం తెలీకుండా నేను అలసిపోతుంటే
వందల సార్లు నువ్వు విసుగు లేకుండా నన్ను పిలుస్తుంటే..
అయిష్టంగానే ఎప్పటికో ఇంటికొస్తాను , నీరసంతో నీ ఒడిలో సోలిపోతాను
నువ్వు లేపి గోరు ముద్దలు పెట్టేంత వరకు, మూతి తుడిచి మళ్ళీ నిద్ర పుచ్చే వరకు!

అనుకోకుండా అర్ధ రాత్రి చదవాలనిపించి నేను లేచి కూర్చుంటే
గాఢ నిద్రలో ఉన్న నీకెలా మెలకువొస్తుందో ..అంత అలసినా మళ్ళీ ఓపికెలా వస్తుందో
ఆ నడి రాతిరి నా కనులను కమ్మేస్తున్న నిదురను తరిమేందుకు నువ్విచ్చిన తేనీటి వెచ్చదనం
ఇన్నాళ్ళ తరువాత గుర్తొచ్చినా...ఎదను ఉక్కిరి బిక్కిరి చేసేటంతటి ఆనందం ఎందుకో ...!

నా క్షేమం కోసం ఆరాటపడడాన్ని ఆంక్షల చట్రంలో బంధించే యత్నమని భ్రమించి
రెక్కలొచ్చాయన్న ధైర్యంతో రివ్వున ఎగిరిపోవాలని ప్రయత్నించిన ప్రతిసారి
నన్ను వెనక్కి లాగి పొదివి పట్టుకున్నది నా మీద నీకున్న ప్రేమే తప్ప పంతం కాదని
ఇన్నేళ్ళ తరువాత ఇప్పుడు అర్థం అయ్యాక నా అమాయకత్వానికి నాకే నవ్వొస్తుందెందుకో!

జీవితం పూరించలేని సమస్యలా మారి
నా ప్రతీ ఉదయం భయంతో మొదలైనప్పుడు
వరుస ఓటములతో నా ప్రపంచం మసకబారి
ఒంటరితనంతో నేను దహించుకుపోతునప్పుడు...

ముడుచుకున్న ఈ పెదవుల మీద నవ్వులు పూయించిందీ
నా ఊహల చిత్రాన్ని మళ్ళీ ఆశల వర్ణాలతో నింపింది నువ్వే!
అపజయాలను దాటుకుని గెలవగల సత్తా నాకుందని నమ్మిందీ
నేను విజేతలా అందరి ముందుకి వస్తానని విశ్వసించింది నువ్వే !

ఉద్యోగమంటూ నేను ఒంటరిగా ఊళ్ళు వెళ్ళేందుకు సిద్ధపడినప్పుడు
నా వెన్ను తడుతూ నువ్వు వీడ్కోలు చెప్పడానికి వచ్చినప్పుడు
నీ చెంపను ముద్దాడిన నా పెదవుల నంటిన ఉప్పదనం ......
కన్నీళ్ళను దాయగలిగిందేమో కాని నీ గుండెల్లోని ప్రేమను కాదు !!

నీ కన్నా బాగా నన్ను చూసుకునే మనిషి కోసం...
నా కన్నా ఎక్కువగా పరితపించి....నాకో సరిజోడు వెదికినా...
నీకు మాత్రం తెలీదా అమ్మా....
నిన్ను మించగల్గిన వాళ్ళు సృష్టిలో ఇంకెవ్వరూ లేరని...ఉండరని....! ***

## వీడ్కోలు నేస్తమా

శ్రీకుమార్

**తీరని ఆశల కోసం,**
చేరని గమ్యం కోసం
నా దారిని వెదుక్కుంటూ...
నిన్ను వదలిపోతున్నా
కానీ నీ చెంతే
నా మనసు వదలిపోతున్నా

ఎవరూ విడదీయలేని స్నేహమిదే అనుకున్నాం
ఏనాడూ వీడిపోని బంధం మనదనుకున్నాం
కాలాన్నాపే శక్తి ఏదీ లేదని తెలిసి
తిరిగి రాని నీ తోడు
తెలిసీ చేజార్చుకుంటూ...
నిన్ను వదలిపోతున్నా
కానీ నీ చెంతే
నా మనసు వదలిపోతున్నా...

ఏవేవో చేద్దామని కలలు కలిసి కన్నాం
సరదాగా ఎన్నెన్నో కబుర్లు చెప్పుకున్నాం
కంటికి కనిపించనంత దూరంగా భారంగా
మరువలేని గురుతులెన్నో
పదిలంగా దాచుకుంటూ...
నిన్ను వదలిపోతున్నా
కానీ నీ చెంతే
నా మనసు వదలిపోతున్నా...

కష్టసుఖాలనన్నీ కలిసి పంచుకున్నాం
మాటా మాటా వస్తే తగవులాడుకున్నాం
తెలిసీ తెలియక నేను పొరబాటున ఎపుడైనా
మనసుకు గాయం చేస్తే
మన్నిస్తావనుకుంటూ...
నిన్ను వదలిపోతున్నా
కానీ నీ చెంతే
నా మనసు వదలిపోతున్నా ***

## బాల్యాన్ని పాతరేసిన చోట

జ్వలిత

ఓ నా అనంత ఆది దపంతుల్లారా..
ఓ నా అపూర్వ తల్లి తండ్రుల్లారా...
పిందె కు పూసిన బీరపువ్వును
ఆనందించిన అద్భుతం నా బాల్యం
మోదుగు పొదల్లో మాబీర తెరల్లో
వికసించిన విస్మయం నా శైశవం
బొటన వేలిపై వెలిసిన
చిత్ర చిత్రాల చిన్గా దాలను
మానవ సమూహ శెనగ చేలల్ల
తొవ్వుకుంటున్నా నిర్విరామంగా
****
అనంత సాగర చెలియలి కట్టలు
అతిక్రమించిన అమ్మా..
నిన్ను నువ్వు పరిక్రమించే క్రమంలో
నాకు ఏకాంత సంపదనిచ్చి
అపురూప అనాధను చేశావు
ఇప్పుడు నా రోదన
విశ్వ మహిషి చెవిన వీణానాదం
యాసిడ్ జల్లులు - అగ్ని వర్షాలు
ఖడ్గ  పుష్పాల అలంకారాలతో
అనునిత్యం ఆరాధన నాకు
నాగరిక లోహ కౌగిళ్ళు
గుండె గోడలను దూగోడ పట్టి
కృత్రిమ కుసుమ చిత్ర కళా ప్రదర్శన
నిత్యం
అమాయకపు పవిత్ర దాంపత్యం లో
'హైమాస్' పొర సాక్ష్యం ఓటమి
అనివార్యం

తడిమి తడిమి పుత్రులకు
రక్షణ కవచాలిస్తున్న గాంధారి
మాతల్లారా...
ఓ నా తాతల తండ్రుల్లారా..
మీరొదిలిన కుక్క మూతి పిందెల
వారసత్వం
మీ స్వార్థ ప్రేమల సామ్రాజ్యాలు
పైశాచిక శత్రు సంపదను పెంచాయి
ఆకాశం అవకాశం పొంది
విశృంఖల విహంగమై
ఆధునిక స్వార్థ సాధికార తల్లుల్లారా..
అనునిత్యం చిదమబడిన టేకు చిగురై
రూపాంతరం చెందినా బాల పసి
బాలింటాను
****
ఓ మను సంభవ వారుసుల్లారా..
మీ కోరికల స్వేచ్ఛా తీవ్రత
నాకు శూన్యపు చితులు పేరుస్తూంది
పొత్తిళ్ళలో పొదుగు కొనే నానమ్మలు
విచిత్ర పొడుపు కథల అమ్మమ్మలు
సామెతల ఆమెతలిచ్చే తాతయ్యలు
అంతరించిన ఏకాకి అరణ్యం నేను
****
ఓ "సర్రోగేట్" అమ్మల్లారా..
ఓ "గే" దంపతుల్లారా..
ఆప్యాయతల కుటుంబం సాగుదల వెల్ల
వేసుకొని

కాంక్రీట్ బంధమై కాసుల లెక్కల్లో
రోడ్డున పడుతున్న సంసారాల్లో..
బొమ్మరిల్లు కూల్చబడి
నా రక్త మాంసాలు డబ్బు మూటకు
చెల్లు
****
ఒక తల్లి అనేక తండ్రులున్న పిల్లల్లారా..
ఒక తండ్రి సమూహ సవతుల
బిడ్డల్లారా..
మీకోసం అనుక్షణం అడుగడుగున
మృత్యు సంతాల స్వాగతాలు
****
ఓ నా విశ్వ పితామహుల్లారా...
ఓ నా అనాది మాతామహుల్లారా..
మసి బారిన గోడలలో
నా వలెనె సొట్టలు పడ్డ సత్తు గిన్నెల్లో
పాకురు జాలారు బండల్లో
చీకటి వెట్టి సమాధుల్లో
అట్ట కట్టిన ఆకలి పేగుల
నా అగమ్య గోచర బాల్యాన్ని
పాతరేసిన చోటే
రేపటి నా ఆశల వారసత్వానికి
బొడ్డు నాలికను నిక్షిప్తం చేస్తున్నా
"విరోధి" విక్రుతమౌతున్న
యుగాది తరుణాన
ముద్ద బంతి పూదోట నారు కోసం
****

# ప్రయాణం

రాగద్వీప

**ఒకటి రెండు మూడు అంటూ**
అవమానాలు లెక్కపెట్టుకుంటుంటాను
అంకెలన్నీ అయిపోతాయి
అవమానాలకు అంతుండదు
ఎదురుదెబ్బ తగిలిన ప్రతిసారీ
ఇదే ఆఖరుది , మళ్ళీ ఇక ఇలా జరగదనుకుంటాను
ముళ్ళు, రాళ్ళు, అగాధాలమాయమయిన దారిలో
తూలిపడకుండా నడవడమేలా?
నడిచిన దూరం కంటే బోర్లపడిన అనుభవాలే ఎక్కువ
చిరునవ్వుతో సాఫీగా నడిచిపోయే
నా సహ ప్రయాణీకులను చూసి
నా ప్రయాణం కూడా అంత సులువేననుకుంటాను
నా చేతిలో కులమన్న ఊతకర్ర లేదు
వంశ మన్న దీపము లేదు
చీరకుచ్చిళ్ళు కాళ్ళకడ్డం పడుతూనే ఉన్నాయి
నా వర్గం నాకు పాదరక్షలు ఇవ్వనేలేదు
నడవాలంటే అడుగులు వెయ్యాలన్నది యెంత నిజమో
అవమానాలు , అవహేళనలు , ఎదురుదెబ్బలు నా ప్రయాణంలో అంత నిజం
నిజానికి నా ప్రస్తానమే అది
నా ప్రయాణమే ఓ యుద్ధం
జయాపజయాలు అప్రస్తుతం ***

## నేను

డా.ఎన్.కిశోర్ కుమార్,జెర్మనీ

నేను నవ్వులు చిందిస్తాను
నిప్పులూ కురిపిస్తాను!
నేను హాయినిచ్చే శీతలపవనాన్ని
మాడ్చివేసే వడగాలి వీచికని!
ఇట్టే కరిగే వెన్నని
చలనం లేని శిలని!
ప్రభాత కిరణాన్ని
చిమ్మచీకటిని!!
చల్లని వెన్నెలని
చండప్రచండ సూర్యకిరణాన్ని!
పిల్ల కాలువను
మహాసంద్రాన్ని!!

అందివచ్చిన అవకాశాన్ని
పొంచిఉన్న ప్రమాదాన్ని!
సుతిమెత్తని తివాచీని
నడువజాలని ముళ్ళబాటని!!
మధురమయిన సంగీతాన్ని
భయోత్పాత ప్రళయ ఘోషను!
నా గుండెలోతుల్లో
ప్రణయం కనిపిస్తుంది
ప్రళయం గోచరిస్తుంది
అర్థమయ్యే ఓ సిద్ధాంతాన్ని
అంతుబట్టని ఓ వేదాంతాన్ని!! ***

## ప్రకృతి

సన్నిహిత్

బాల్యంలో జోలపాటవై
లాలించావు-
యవ్వనంలో కలలు పూచే రాత్రి చెట్టు కొమ్మకి
ఊయలూగించావు-
ఎగిసి ఎగిసి మిడిసి పడే అలలాంటి
మోహావేశాన్ని నీ కౌగిలిలో విరిచేసావు-
ఎవరివో నీవు ?
పిల్ల కాలువను
మహాసంద్రాన్ని!!

తల్లివా?స్నేహితవా?ప్రేయసివా?
కాదు -కాదు -నీవు ప్రకృతివి:
అవును నిజంగా నీవు ప్రకృతివే
బ్రతికుండగనే నన్ను నీలో
కలిపేసుకున్న వికృతివి
జీవితపు చరమంలో
జ్ఞానం ఇస్తున్న ధరిత్రివి;
పిల్ల కాలువను
మహాసంద్రాన్ని!! ***

## మ్యూజియంలో పెళ్ళి

డా.రమణ యశస్వి

**తాళిబొట్లు, నుదుటి బొట్లు**
పండి 'పోయిన' పెళ్ళికి బండ గుర్తులుగా
మ్యూజియంలో మిగలనున్నాయి!
అంతరిస్తున్న ఆచారాల జాబితాలోకి
జరజర, బిరబిర జారిపోతున్నాయి!
పెళ్ళికి ముందే కళ్ళెం తెంపుకుని
శృంగారపు కోర్టుల్లో
నయం భయం లేని
నవయువ జంటలు తయారై
తమషా చేస్తున్నాయి!
చీరకట్టులు, కాలి మెట్టెలు కనుమరుగై
తలంబ్రాలు నూతన'బ్రా'లని
పొరబడే రోజులు తరలి వచ్చేశాయి!
అబార్షన్ మాత్రలకు మల్లే
మంగళసూత్రాలకు
ఎక్స్‌పైరీ డేట్లు రాస్తున్నారు!!
సహజీవనం అంటూ సహనం కోల్పోయి
ఏడడుగుల బంధానికి ఆరడుగుల
సమాధి కట్టనున్నారు!
అమ్మ నిజం నాన్న నమ్మకం
అంటూ డి.ఎన్.ఎ టెస్టులకోసం
బారులు తీరనున్నారు!

అగ్ని సాక్షిగా పెళ్ళెందుకు?
తంతుసాక్షిగా తల్లిదండ్రులెందుకు?
మీడియా సాక్షిగా లివింగ్ టుగెదర్ అంటున్నారు!!
పెళ్ళి పెటాకులైతే
విడాకుల ఊసే ఉండదని
వితండ వాద పతంగాన్ని ఎగరేస్తున్నారు!
కులగజ్జికి కట్నం దురదకీ సరైన చికిత్స
సహజీవనం అనే జాలిమ్ లోషనేనని
సూత్రీకరిస్తున్నారు!
ఫోన్ లో పెళ్ళి , నెట్లో పెళ్ళి
పెళ్ళీ నీకే పెళ్ళి జరుపుతున్నారు!
ఓ! పెళ్ళీ
తరతరాల తల్లీ
నీకు నూరేళ్ళు నిండనున్నాయి!
నువ్వే కోర్టులకెళ్ళినా నెగ్గలేక ఓడి
కనీకనపడని అరుంధతీ తారగా
నిలిచిపోనున్నావు!! ***

## శతాబ్ది వెన్నెల

డా.కె.గీత

**నాలో మహావృక్షమై** నాటుకున్న
ఒక చిరు బీజం -
అంతర్లీన సదస్సులో ఈదులాడే చేపపిల్ల-
నిశ్శబ్ద కుహరంలో తొమ్మిది నెలలుగా నిద్రపోతున్న పసిపాప-
ఇప్పటికీ బీడువారని క్షేత్రాన్నై
మొలకెత్తే చిరునవ్వు చిరునామాన్నై నేను-
ఎలా ఉన్నావు పాపాయీ?
అప్పుడూ ఆశ్చర్యమే - ఎప్పుడూ విచిత్రమే
తెరలు తెరలుగా నలుపు తెలుపుల్లో కదిలే నిన్ను
వీక్షించినప్పుడల్లా కడుపారా ప్రవహించే మాతృత్వ
మధురానుభూతి-
నీకోసం ఎన్నెన్ని జాగ్రత్తలు!
కుంకం పువ్వు, నారింజరసం
ఒమేగాలు, ఫోలిక్ యాసిడ్ లు - క్రమం తప్పని టైమ్
టేబుళ్ళు-
నువ్వు చిరుమెత్తగా రెక్కలు విదిల్చి
గజఈత నేర్చినట్లుగా గింగరాలు కొట్టి
పుట్టకుండానే పరుగు నేర్చినట్లు పిడి గుద్దులు గుద్ది
నన్ను నిలువెల్లా పాలు ప్రవహించే అమ్మని చేస్తావు
పాపాయి కదలిక ప్రాణమైన ప్రపంచాన
క్షణాలన్నీ కడుపుకి చేరువై పొట్ట తడిమే చేతులవుతాయి
ప్రేమంతా వేళ్ళలోకి ప్రవహించి
స్పర్శతోనే తొలిపరిచయాలౌతాయి-

కళ్ళు తిరగడాలు, వాసనల వికారాలు
వాంతులు, లేవలేని తనాలు
నెలకో బాధ నిలబడనీకుండా చేసినా
ఎటు ఒత్తిగిల్లో నిద్రపోలేకున్నా
బయటి లోకపు ద్వారపాలకురాలినై
రాత్రింబగళ్ళు నీ కోసమే పహరా కాస్తున్నా-
నువ్వు కళ్ళువిప్పే తొలికాంతినై
నిన్ను చుట్టుకోవడం కోసమే అన్నిటినీ తట్టుకుంటున్నా-
చిరు చిన్న పాపాయీ!
మనిద్దరం ఒకే శరీరపు రెండుభాగాలం
నిజానికి నాలో నువ్వున్నా
నీ కడుపులో నేనున్నట్లు అనుక్షణం పరవశం -
వత్సరాలు ఎన్నో గబగబా దాటెళ్ళి పోయినా నీరూపంలో నేను
మళ్ళీ ఓ వందేళ్ళు పోగుచేసుకుంటాను
నీ నించి ప్రవహించే రక్తమై పరిణామం చెంది
శతాబ్దాల తరబడి జీవించే ఉంటాను
కృతజ్ఞతలు పాపాయీ!
శతకోటి కృతజ్ఞతలు -
ఆకాశంలో వెన్నెలవై నాలో ప్రవర్థమానమవుతున్నందుకు
అందరి పెదాల మీద తడి తళుక్కువై
ఇల్లంత కేరింతవవుతున్నందుకు!

***

## ఒక బెయిట్(ఎర)చాలు

నారాయణ గరిమెళ్ళ

**ఇదేమీ.....**
ఆకలి దహించేస్తున్నదొంగకి తిండిగది తాళాలిచ్చి,
కాపలాగా పెట్టిచూశామని కబుర్లు చెప్పి,
'పట్టెశామోచ్! దొంగ దొరికాడు' అని
చంకలు గుద్దుకునే మూర్ఖత్వం కాదు.
కడుపులు నిండాయని త్రేంచి మరీ తెగేసి
చెప్పిన వాళ్ళ మధ్య
వదిలిన బెయిట్ మాత్రమే.
ఒక చిన్న బెయిట్ గాసిప్ రూపంలో అందిందా అది చాలు
అనేకానేక కుసంస్కారాల్ని వల వెయ్యకుండానె పట్టుకోవచ్చు.
వేరవ్వరో బలి అవుతూంటె చలి మంట కాచుకోవడంలో
మజాని
ఎవ్వరు మాత్రం వదులు కుంటారు చెప్పు?
బెయిట్ ని ఆస్వాదిస్తున్న  సమయంలో
'మసి బూసి మారేడు కాయలు చెయ్యగలిగె 'నేర్పరి తనం
ఎవ్వరూ నేర్పకుండానే అబ్బేస్తుంది!!
ఆశ్చర్యంగా  సమయంలో,
బలిపశువుకు లేని అపవిత్రత ఆపాదించి
అంతం చెయ్యాలన్న బలమైన కోరిక తప్ప
తన లోని పవిత్రత ఎంతో మచ్చుకైనా
చూసుకోవాలనిపించదు!!
చుట్టూ వున్న ప్రపంచాన్ని అర మరికలు లేకుండా
కౌగిలించుకునే ముందు
ఒక బెయిట్ని పెట్టి చూడు
ఎన్నెన్ని బిట్టర్ టేస్టులు నాలుక మీద
మొగ్గలేస్తాయో నీకే తెలుస్తుంది!
అనేకానేక మాటలు పారేసుకున్న
వంకరలు తిరిగిన నాలుకలు కొన్నైతే
కొండొకచో 'తప్పయ్యిందని'
కరుచుకుని లెంపలేసుకునేవి మరికొన్ని.
నిఖార్సైన వాళ్ళకు మాత్రం
బెయిట్ అంటే కేవలం నీటి బొట్టు మాత్రమే
ఎందుకంటే వాళ్ళు తామరాకు రూపాలు!
పక్కనుండొచ్చె చిరు తిండి కన్న
స్వహస్తాలతో కూర్చుకున్న సంస్కార భోజనమే వాళ్ళకు ప్రీతి!

***

## మిత్రభేదం

డా.వైదేహీ శశిధర్

**పూర్తిగా ఆలపించకుండానే**
అర్ధంతరంగా ఆపేసిన రాగాలు
కొన్ని పరిచయాలు.
అభిమానంతోనో అతిశయంతోనో
ఎప్పటికీ పూర్తిచేయని
జుగల్బందీలు కొన్ని స్నేహాలు.
అసహనంతోనో అపనమ్మకం తోనో
మధ్యలోనే ముగించిన
రహదారి ప్రయాణాలు
మరి  కొన్ని పరిచయాలు
మొత్తంగా రేకులు
విడివడకముందే
తన పరిమళంతో
జ్ఞాపకాల్ని వెలిగించే
స్నేహపుష్పాలని
అహాల  పోరాటం వల్లో
అమాయకమైన అజ్ఞానం తోటో
కొనగోటితో  చటుక్కున
త్రుంచేసే వేన వేల హస్తాలు !!!

***

## పంద్రాగస్టు

బలివాడ వెంకట్ పట్నాయక్

స్వతంత్ర దినం ఘనంగా ముగిసింది...
దేశ సరిహద్దుల్లో రాలిపోతున్న మన బిడ్డల్లా
జండా నుంచి పూ లు టప టపా రాలిపోయాయి.
చిన్నారుల చేతులు క్లేప్స్  కొడుతుంటే
రాజకీయనాయకుడు రాబొయే  ఓట్ల కోసం
కాబోయే ఓటర్ల తలలను లెక్కిస్తున్నాడు...

మంత్రి వర్యులకోసం కట్టిన స్వాగత తోరణాలు
పక్కకు తొలిగిపోయాయి.
నిన్నటి దినంలానే పంద్రాగస్టు  పలచగా
గొప్పల మధ్య  నప్పక పక్కకుజరిగిపోయింది.
ముచ్చటైన మువ్వన్నెల పతాకం వర్షపు చినుకులకు
రంగు వెలసి పోయింది..ప్రజాస్వామ్యంకు ప్రతీకలా...
ఈ రోజు పోలీసుకు కంటిమీద కునుకు ఉండదు
పబ్లిక్ హాలిడే  వలన పేదవాడి ఆలి కూడు వండదు

షరా మామూలే..
స్వతంత్ర దినం ఘనంగా ముగిసింది...
భయం నీడలో పండగ చేసుకుంటున్నాం
లేనిపోని గొప్పలు చెప్పుకొని
వదులైపొయిన జబ్బలు చరుసుకొంటున్నాం

నిజమే...
స్వతంత్ర దినం ఘనంగా ముగిసింది...!!!

***

# నేనెవ్వరు

ప్రఖ్య మధుబాబు

కాగితాల కూరుకున్న
ఊపిరితో ఊగుతున్న - నేనెవ్వరు? నేనెవ్వరు?
నిద్ర నుండి తేరుకుని
నిద్రలోకి జారుకునే - నేనెవ్వరు? నేనెవ్వరు?
జీవ మహా సింధువులో బిందువునా?
మెరిసి అంతర్ధానమయ్యే విద్యుల్లేఖనా?
అనంతంగా కదిలే సరళ రేఖనా?
ఆత్మనా? పరమాత్మనా?
సాంఘిక, సంఘర్షిత విస్ఫోటనల మధ్య
సామాన్యుడినా?
చీకట్లో దెయ్యం ఉందేమోనని భయపడే నాస్తికుడినా?
పనులుకాక 'నువ్వు లేవు ' అని పరమేశ్వరుణ్ణి తిట్టే ఆస్తికుడినా?
తండ్రి కొడుకునా? కొడుకు తండ్రినా?
వేల కోట్ల పరంపరల తరంతరల నుండి వచ్చిన జన్యు చైతన్యాన్నా?
లయబద్ధ కర్మయుద్ధ హృద్స్పందనా సిద్ధుడినా? కాల సంబద్ధుడినా?
చిన్ని కాలాన్నా? మహా జ్వాలాన్నా?
సృష్టిమూల శంకరుని ముందు నందినా?
జీవన సంయుద్ధ వ్యర్ధ వర్ధ సమర్ధ స్వార్ధ ప్రయోగశాలలో గిన్నీ పందినా?
ఓంకారాన్నా?
అపరిమిత అహంకారాన్నా?
అనందం చిందే చిరు కెరటాన్నా?
పాకుతూ బయల్దేరి పరిగెత్తాలనే ఆరాటాన్నా?
దేవుడిలో "దే" నా?
లేమిలో "లే" నా?
ప్రేమకోసం "ప్రే" చేస్తూ
ఊహలు "ఊ" రించగా
చివరికి "ఛీ" అనుకునే చింపిరి జీవిత తుంపరనా?
వార్నీ! ఇంతకీ నేనెవరిని??
ఎప్పుడూ నేనెవరినో తెలియని నే "నెవెర్" ని ! నే "నెవెర్" ని !!

***

## జీవన గీతి

- రామడుగు వేణుగోపాల్

మర్యాద అంగట్లో దొరుకునా వెదికినా?
విలువల పొదుగు పాలతో ఎదిగిన
గురువులెల్ల కొలిచి తెలుసుకున్న
మనుజుడు మెలగిన మంచి సాంగత్యమున
ఇచ్చినదె మర్యాద వొచ్చునని ఎరుగు
తెలుగు తేనే ఊట "రామడుగు" నోట!

చిరునవ్వుల సమూహం జీవితమవ్వాలి
కని కన్నీరుతో కాదు
మిత్రుల సమ్మేళనం నీ వయసు కావాలి
కాని ఏళ్ళతో కాదు
నిత్యసత్యమిది తెలుసుకో సోదరా
తెలుగు తేనే ఊట "రామడుగు" నోట !!

***

## ఒంటరిపుష్పం

- కె.విజయభాను

నీ జ్ఞాపకాలను చాలా దూరంగా తరిమేస్తూ
తేలికైన గాలి కూడా నా నిట్టూర్పులతో బరువెక్కుతోంది
నీ ఆలోచనలను దూరంగా విసిరివేయడానికి
ఎడతెగక కొట్టుకుంటూనే ఉంది
ఈ గాలి నా వేదనలతో పోరాడలేక అలసిపోతూనే ఉంది
ఇంకా నీ భావాలను నా ఊహల్లో ఊయలూపుతూనే ఉన్నాను
ఆ కంపనాలను మదిని దొలిచేయనిస్తూనే ఉన్నాను
నిరంతరాయంగా వెలుగు నాపై ప్రసరిస్తూనే ఉంది
కానీ నా చుట్టూ కనిపించని చీకటి కమ్ముకోవడాన్ని
చూస్తూనే ఉన్నాను
నీ రూపాన్ని మసకబార్చొద్దని కళ్ళను వేడుకున్నా.....
వాటి తప్పేముంది? కన్నీటి ప్రవాహం ముందు కళ్ళ
విలువెంతని?
మూలకి నెట్టబడిన ఆనందం మూలుగుతూనే ఉంది
మొదటిసారి శిశిరాన్ని దాటడం కష్టంగా ఉంది
చిగురాశలు ముడుచుకుపోయి మనసుమూలల్లో దాక్కున్నాయి
అల్లుకున్న స్వప్నాలు పగిలిన గాజు ముక్కలై కళ్ళ నిండా
పరుచుకున్నాయి
పసివాడి మూగనోము పట్టిన ఒంటరి పుష్పాన్ని నేనిపుడు.....
యధేచ్చగా ఉరుములు లోపలికి జొరబడుతున్నాయి!

***

## ఆడపిల్ల

– పాలపర్తి జ్యోతిష్మతి

## ఉత్తరాలా అవి!?

– ఎస్.ఆర్.బందా

ఆడపిల్లవి, నీకు టిఫినెందుకే?
చద్దన్నం తిను – ఒక తల్లి వివక్ష
ఆడపిల్లవి ఎంత చదివించినా
మన దగ్గరుంటుందా?
అత్తారింటికి వెళ్ళిపోయేదేగా – ఒక తండ్రి నిర్వేదం
ఆడపిల్లని పెద్ద చదువు చదివిస్తే
మాట వినదండీ!
తొందరగా పెళ్ళిచేసి పంపించెయ్యాలి – ఒక పెద్దమనిషి
అభిప్రాయం
ఆడపిల్లవి, నీకు ఇంగ్లీషు చదువులెందుకే?
తెలుగు మీడియంలో చేరు, చాలు
– ఒక అన్న ఈసడింపు
ఈ చదువులతో నువ్వు కుస్తీ పట్టలేవు కానీ
అంట్లు తోమడం, బట్టలుతకడం నేర్చుకోవే
– ఒక తమ్ముడి ఎగతాళి
ఆడపిల్ల
పనికెళితే కూలి తక్కువ
ఆటలకెడితే పారితోషికం తక్కువ
డాన్సులకెళితే బట్టలు తక్కువ
ఆధునిక మహిళ
ఆకాశం అంత ఎత్తు ఎదిగినా
అంతరిక్షంలోకి ఎగిరినా
'ఆడపిల్ల' అధఃపాతాళంలోనే!

***

ఉత్తరాలా అవి!
దివ్యంగా మెరుస్తున్న నక్షత్రం నించి జారిన స్టార్ డస్ట్
వెలుగుతున్న దీపం వొత్తి నుంచి వెలికురికిన మెరుపురేఖలు
చూపుకందని సౌందర్యం నుంచి నిత్యం వ్యాపించే సువాసనలు
ప్రశ్నించే నిశ్శబ్ద గీతాల – అమృతపు రుచులు
కళ్ళు తెరిపించే వాదనలు – కళ్ళు మూయించే తాదాత్మ్యతలు

ఉత్తరాలా అవి!
అవి ఘులామలీ గమకాలు – సంధ్యారుణిమ సోయగాలు
'థాట్' ను కుదిపే తరంగ దైర్ఘ్యాలు – ఆశగా చూసే పిల్లకు
తాయిలాలు
కలం కమానుతో హృదయ వాయులీనమ్మీద కవాతు చేసే
కవనాలు
జాగృదావస్థలోనూ అపుడపుడూ తట్టి లేపి దారిచూపే
ప్రకంపనాలు
తీసుకున్న పువ్వుకు బదులు
తన స్తనాన్నే కోసి కొలనుకివ్వబూనిన
ఔన్నత్యపుటుదాహరణలు
మనిషికి మెదడే కాదు గుండె కూడా ఉంటుందని చెప్తూ
లబ్ డబ్ ల భాషలో వ్రాయబడిన కావ్యాలు
ఉత్తరాలా అవి!!

***

# ఎదురొస్తావా?

- రవికిరణం

మళ్ళీ జన్మిస్తామా
అప్పుడు - నువ్వు ఎదురొస్తావా!
నీవు లేకుండా సాగిన నా పయనం
పూస గుచ్చినట్టు చెప్పుకోవాలి
ఒడిలో నిదుర పోయిన్నట్టు
కళ్ళు తెరిచి ఆకాసం చూడాలి
నీ కురులు ముఖాన జారుతుంటే
నా చేతులు అదే పనిగ సరి చేయాలి....
నేనిచ్చిన పచ్చ పరికిణిలో
నీ కళ్ళు మెరువాలా
సోగ కనులను
వర్ణిస్తూ కొత్త కవనం దిద్దలా
నింగి సుక్కలు సూడంగా
నేల సుక్కలా మెరవాలా!
నీ పట్టీ గొలుసుల సవ్వడీలో..
నా గూండె సప్పుడు మోగాలా...
మన వూరు చెరువు కాడా
నువ్వు నేను కనిపించినట్టు
లోకం కోడై కూసిందంటా!
అభిమానం అత్మను తాకి
ఉరి తాడును వరించినావా?
ఊరు కేమయింది..వాగుతుంది
ఏరు కేమయింది...పారుతుంది
నీవు లేని నేను
నీకోసమే వస్తున్నాను..
మళ్ళీ జన్మిస్తామా
అప్పుడూ
నువ్వు ఎదురొస్తావా?

***

# అక్కడ..మనిషి..!

**భువనచంద్ర**

ప్రముఖ చలనచిత్ర గేయ రచయిత శ్రీభువనచంద్ర గతంలో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేశారు. 1971 సంవత్సరంలో జరిగిన ఇండో-పాక్ యుద్ధంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఆ సమయంలో కళ్ళముందు నేలకొరిగిన ఓ అపరిచిత సైనికుడిని చూశాక వ్రాసిన కవిత ఇది:

రచనా కాలం: 1971

శిలవో..
కథవో..
వ్యధవో..

అశ్రువు
నిస్పృహ
ఆఖరి
అంచున

అందని
నేలకు
అబ్బులు
చాస్తూ

కెవ్వున
జారుతు
కేకలు
వేస్తూ

చిందిన
రక్తపు
ధారలు
చూస్తూ

తడబడి
పడుతూ
పరుగిడి

నిలబడి
కలబడి
నేలకు
ఒరుగుతు

మృత్యువు
ముంగిట
మూగై
నిలిచీ

ఓడను
ఓడను
ఓడను
నేనిక

ఓటమి
నాకిక
లేదిక
లేదిక

అంటూ
బాధని
తింటూ

రెప్పలు
విప్పుకు
నలుగుర
జూసీ

నరనరమున
నీ
తేజము నింపిన
నీవు -

కలవీ
శిలవో
కథవో
వ్యధవో..!!

***

## ఒంటరి పయనం

కె.క్యూబ్ వర్మ

గుండె గది మూలల్లో
మెదడు జ్ఞా పకాల పొరల్లో
అలా తెరలు తెరలుగా
తేలియాడుతూ గబా గబా
గాభరాగా ఎవరో తరుముతున్నట్లుగా
గాలి ఏదో తోసుకుపోతున్న మబ్బుల మల్లె
ఏదీ ఆగకు౦డా పయనమవుతూ
ఒంటరిగా ఈ గది మూలన నన్ను
వదిలి...

రాజుకుంటున్న జ్వాల పైకెగిరినట్లే
ఎగిరి మాయమవుతున్నది
తర౦గాలుగా లేస్తున్న ఆలోచనలు
ఒక్కమారు కుప్పకూలి
నన్నీ అగాధంలో తోసివేస్తూ...

మూతలు పడుతున్న రెప్పలు
ఎంతకీ తెగని సుదీర్ఘ అసంపూర్ణ
స్వప్నాన్ని తె౦చలేక
అలసిన దేహాన్ని ఇలా
ఈ గదిమూలలో ఒంటరిగా ...

***

## సొగసుచూడ తరమా..!

శ్రీకిరణ్

ప్రతి సవ్వడి ఒక సంగీతమై
ప్రతి భావం ఒక రాగమై
ప్రతి పదము ఒక పల్లవై
ప్రతి మాట ఒక పాటై
తన శృతిలో ఒక లయగా
ఈ మది వుయలలూగుతుంటే
తన యెద కోయిల పాడుతుంటే
నే తన పదముల చెంత చేరి
ఆ కాలి సిరి సిరి మువ్వలు సరిచేస్తుంటే
నల్ల మబ్బుల చాటు చందమామలా
తన మోమును కురులు కప్పేస్తుంటే
సరిచేయలేని విసుగు చూస్తూ
తన వశంలో పరవశంతో
ఆ సొగసు చూడతరమా ..............!
ఆ వివరం విప్పి చెప్పగలనా?.

***

# జీవనపోరాటం

అనంత్ మల్లవరపు

**అంతరాంతరాలలో అనంత సంచలనం నిరంతర జీవనపోరాటం**
ఉఛ్వాస నిశ్వాసల మధ్య ఊగిసలాడే గాలిదీపం
క్షణమొక విధంగా, ఉవ్వెత్తున ఎగిసిపడే ఆలోచనా తరంగం
క్షణం క్షణం కరిగిపోయే విలువైన జీవనప్రాయం

ఏదేదో చెయ్యాలని ఇంకేదో చేసెయ్యాలని
ఉల్లాసం, ఉత్సాహం, ఉద్వేగం
వాడేదో అన్నాడని, వీడేదో చేశాడని
అంతలోనే నిర్వేదం, నిస్సత్తువ, నిర్లిప్తత

పెరుగుతున్న జనావళికి, ఎదుగుతున్న మానవాళికి
అనుక్షణం అలుపెరుగని నిత్యావసర సరాగం
కోరికలే అవసరాల గుర్రాలై పెరుగెడుతుంటే
ఆగేదెలా, ఇంక సాగేదెలా ఈ జీవన చెలగాటం

రోగాలు రొప్పులు ఏవేవో తిప్పలు ఇరుకున పెడుతుంటె
మిణుకు మిణుకు మనే ఆశాదీపం చావుభయం తెలియని
సైనికుడిలా చివరికంటా నీ వెంటే వస్తుంది
నీ తోడై ఉంటుంది, నిన్ను అమరుణ్ణి చేస్తుంది

నేనేదో గొప్ప, నువ్వేదో గొప్ప, బుద్ధిబలం తప్ప
అహంకారపు పోకడలు, అవివేకపు ఆలోచనలు
ఆసాంతం ఆవహించుకుపోయిన ఆధునికపు ఓ మనిషీ
చరిత్ర చదివి చూడు, నిజమేంటో నిక్కచ్చిగ నేడే నీకు తెలుస్తుంది..!

***

# వృద్ధాప్యం చావలి విజయ, ఆస్ట్రేలియా

వస్తుంది రావద్దన్నా
రాకూడదన్నా రాలేదనుకున్నా
వస్తుంది.
ప్రతి మనిషికి వస్తుంది- ముసలితనం.
చర్మంలో ముడతలు - వొంట్లో నలతలు
జుట్టులో వెండి తీగెలు - పట్టులో సడలింపులు.
మరపులు - నొప్పులు
చెప్పుకోలేని జబ్బులు - చాలవనుకునే డబ్బులు
కనుల కింద నల్లని వలయాలు - కళ్ళ చుట్టూ సులోచనాలు
రాదు - రాబోదు
బాల్యం మరల
తెలుసు మనకు
ధ్యానంపై ధ్యాస కుదరదు
పదవియోగంపై ధ్యాస మరలదు.
చిన్నప్పుడు చీదరించుకున్న చాదస్తం
చలో మని వీపు చరుస్తుంది.

అయినా చిన్నగా కనపడాలనే తాపత్రయం
వృద్ధాప్యం చిహ్నాలే మరి
అవునంటారా కాదంటారా?
కానీ
జుట్టు నెరవడం విజ్ఞతకి చిహ్నం అని
కళ్ళ చుట్టూ సులోచనాలు
కదిలే ఆలోచనా వొరవడికి సాక్ష్యాలు అని
చర్మంలో ముడతలు అనుభవాల అలజడికి ప్రతీకలని
తెలుసుకోండి. !!***

# ఒక సగటు రోజు  వేమూరి విజయలక్ష్మి

**తెల తెల్ల వారిన రోజు !**
తలా ఒకరిలో తలో ఆలోచన !
ఒక వైద్యుని దృష్టంతా రాబోయే రోగుల పైనే
రాలబోయే కాసులు, కొనబోయే మేడలు,
కొనుక్కున్నకారులు!
మరి రోగి మనసులో గుబులు
ఏం రోగమో అని భయం!
ఏం మందులు వాడాలో అని ఆత్రం!
ఎలా వెళ్ళాలో అని వేగం!
ఇంట్లో ఇల్లాలి సంగతి చెప్పేదేముంది?
మొదలు అష్టావధానం, కాదు తన స్వతంత్రం ప్రధానం!
విద్యార్థి మనసంతా
విజ్ఞానం, గణితం, భాషలు, వ్యాకరణం,
లేదు ధ్యాస పరిసరాలపై
ఉండదు సమయం ఇతరులకై !
కూలి మనిషి మదిలో
కూలి గురించే చింతే!
కళ్ళ ముందు, ఇతర ఖర్చుల కంటే ముందు కొనబోయే కల్లు ముంతే!
పనిమనిషిలో తక్కువ పని ధ్యాస!
అమ్మగారి చీరలపైనే ఎక్కువ మక్కువ !
అయ్యగారి అజమాయిషీపై విసుగెక్కువ
పిల్లల పనంటే చిరాకెక్కువ!
పైకి నటన, లోన కపటం.
వ్యాపారస్తుని మనసులో లావాదేవీలు,
వ్యాపారంలో లాభ నష్టాల బేరీజులు!
అత్తలకి ఆరోగ్యం, ఆహారం సమస్య!
కోడళ్ళకు ఆడంబరం, అలంకరణ, ఉద్యోగం
స్నేహాలు, పార్టీలు ప్రాధాన్యం.
ప్రతి రోజు ఇదే కథ చర్విత చర్వణం.   !!!

# పిచ్చమ్మ

విప్లవ్

**బట్టలుండవు ఆమెకు**
ఎదంతా ఎండకే
గజిబిజిగొడవల ట్రాఫిక్ జాముల వీధుల్లో
పారేసిన అన్నంపొట్లాలకోసం అన్వేషిస్తూ
తలతెగిపడిన బిడ్డలకోసం వెదికే తల్లిలా
ఆమె చూపు ఎక్కడెక్కడో
జనం ముక్కులు మూసుకునే ప్రపంచాల్లో
ఒళ్ళంతా కళ్ళున్న ఇంద్ర లోకపు దేవతల్లే
వెదుకుతూ , వెతుక్కుంటూ , తరచితరచి
చూస్తూ
నకనకలాడే కుక్కలను పోరాడి గెలిచిన
survival of the fittest మనిషి
ఆమె

బట్టలుండవు ఆమెకు
చర్మం ముడతల్లో
మురికి వాసనల్లో
ప్రేతకళల్లో దేదీప్యమానంగా ఆమె
నా తొలి ఆరాధ్య దేవత
పేరు తెలియదు
ఊరు నాదే
ఇల్లు లేదు
దూరం : నా చూపు అంత
మనసు : నా కవిత అంత
నే నగ్నంగా చూసిన తొలి వనిత
"అది"

ఆకలి అంత భయంకరమైన అందం
ఆమెది
తట్టుకోలేనంతటి అందం
భరించలేనంత ఆకలిగొన్న అందం
జీవితంపై విరక్తి పుట్టించేంత అందం
అందం అందం అందం .. ఛీ
చూడలేను నేను
చూడకూడదు నేను
చూడకూడదు వేరెవ్వరూ
ఆకలిని చంపితే పోదూ అందం ?!

అన్నం వేసా
తీసుకోదు
వందల చెత్తల్లో నా దానమూ ఒకటి
ఒక్కటే
ఆమెకేమి లెఖ్క నా దయ
పిజ్జా వేసా
వాసనైనా చూడదు
బిర్యానీ వదిలేసా
రోడ్డుమీద దుమ్ములో పాచిన అన్నమే
ఆమెకిష్టం
ఆమెకఖ్కర్లేనంత నంత నాగరికత ఆమెది

ఆమె దిసమొలకు తగులుకున్న వేలవేల
కళ్ళలో
నావీ రెండు
పనికిరాని చూపులు
అద్దానికి తగిలినట్లు అక్కడినుంచి నాలోకి
పరావర్తనమవుతూ

నన్ను తూట్లు పొడిచేసి వెక్కిరిస్తూ
నేర్చుకున్న చదువంతా శత్రువేనని చెబుతూ
ప్రశ్నలతో కుళ్ళబొడిచి నా అంతరాత్మను
తినేస్తూ
ఆ నగ్నత్వం

ఆమె కేమి?
ఎగిరే కాకి
బట్టల్లేని కాకి
సిగ్గు లేని కుక్క
కానీ కాదే.పక్షీ , జంతువూ
రెండు స్తనాలున్న మనిషి
చెల్లో తల్లో ప్రేయసో కూతురో
ఆడది
పిచ్చిది
నా దేశం గొప్పది
నేను "నేను" నేనే
ఆమె.. అక్కడే
అలాగే
ప్రతిరోజూ
ఆ జంక్షనులో...అలాగే..
పిచ్చమ్మా
నీకో పేరు పెట్టుకున్నాను తెలుసా
అసలు నేనున్నానని తెలుసా?
పోనీ
నువ్వున్నావని నీకు తెలుసా ?

గొప్పది నా దేశం
నేను "నేను" నేనే
ఇంతకీ... నేను ఉన్నానా ? ***

## అరాచకీయం

ఎస్.ఎల్.శ్రీనివాస్

**ఎవరైనా విన్నారా**
గతి తప్పిన ఉద్యమాలకు సమిధలైన
అమాయకుల ఆత్మలు చెప్పిన
నాయకుల చిదంబర రహస్యాలు
నిశ్శబ్ద నిశీధిలో
సర్పపరిష్వంగ భయోత్పాద స్వేద దేహాన్ని
అతిశీతల ప్రచండ మారుతంలా చుట్టి
చెవిలో వెచ్చగా చెప్పిన పచ్చి నిజాలు
ఏ చరిత్రా చెప్పని పిచ్చి ఇజాలు
ప్రత్యేకం -- సమైక్యం -- ప్రజాభీష్టం
అంతా పెదవి మీది మాటలని
అంతరంగంలో మాత్రం పదవి కోసం బాటలని
ప్రత్యర్థులను పద్మవ్యూహంలోనికి నెట్టాలని
వీళ్ళు
అస్థిత్వవాదంతో ఉన్మాదం సృష్టించే
అద్భుత వాక్చాతుర్య నిష్ణాతులు
అరచేతిలో స్వర్గాన్ని సృష్టించే అబ్రకదబ్రలు
స్వలాభాన్ని ప్రజాహితంగా చూపే మహామాయగాండ్లు
మానవ జీవితాన్ని నిత్యం చెరిచే అభినవ కీచకులు
న్యాయశాస్త్రానికి చిక్కని నరహంతకులు!
ఉనికి కోసం ఉలికిపాట్లు
తెలుగోడికి తప్పని ఉలిపోట్లు
విరోధి నుండి వికృతిలోకి పయనం
అంతంకాని రాజకీయ అరాచకం
ముందుంది జనజాగృతం
అవుతుంది అణువిస్ఫోటకం
పరిఢవిల్లుతుంది సహజీవనశాంతి సాంతం
వికసిస్తుంది సర్వమానవ సౌభ్రాతృత్వం ..!!

(ఆత్మత్యాగం చేసిన అమాయకులకు అశ్రు నయనాలతో ) ***

# మా వూరు

ఆర్.దమయంతి

అటు సముద్రం, ఇటు వయఃపూరం
రెండంచుల పట్టు చీరకట్టుకున్న ముత్తైదువలా
వుంటుంది- నా ఊరు..
పెరటి తోట, గడప ముందు తులసి కోట..
గాలి వీస్తూ కొబ్బరి చెట్లు
రాలి పడుతూ బొగడపూలు
-ఇవీ మా వూరి లోగిళ్ళ ఆత్మీయతా స్పర్శలు
అలికిన అరుగుల మీద సిరిమాలక్ష్మిలు
ఆడపిల్లలాడుకునే ఉప్పులగుప్పలు..
పచ్చగా నవ్వే గుమ్మం
కొత్త కోడలి ముక్కుమీద జారిన కుంకుం
ఇలా అయింది ఏడురంగుల హరివిల్లు-
-మా వూరి వారి ఇల్లు!
మంచుపూల మనసులు
నవ్వితే జలజలా రాలే పారిజాతాలు
స్నేహానికి నిలువెత్తు నిర్వచనాలు.. ఇవీ
-నా వూరి మనుషుల ఆనవాళ్ళు.
అరిటాకు భోజనం, తాంబూల సేవనం,
ఊయల శయనం..
బ్రతకడం ఒక భోగమైన వైనం..
శివాలయ పురాణాలు, రావిచెట్టు గానాలాపనలు,
ఆకాశ దీపాలు, అవిసె పూల గుత్తులు
అన్నీ మదిలో వెన్నెల గుర్తులే...
చల్లని అమ్మ ఒడి
చెట్ల నీడన బడి
పక్కనే వేణుగోపాలస్వామి గుడి
మెట్ల మీద కూర్చుని విన్న కొలని సడి..
ఎప్పుడూ గుండెలో మోగే
కోవెల జేగంటల సవ్వడి
హృదినిండా వెన్నెల సంద్రమైన నా వూరు-
నాలోనే వుండి
నాతోనే వస్తోంది
నా వెంటే నడుస్తుంది
నా శ్వాసలా నను వీడక
నా జ్ఞాపకంలా నా వెనకెనక
ఇంతకీ నా ఊరు-
సాహితీ పరిమళాల అత్తరు
నా పసిడి కలల పైరు
ముద్దు పేరు బంగారు..
ఐనా..
అసలు పేరుమాత్రం బందరు..***

బుక్కులు(పేరడీ) డా.కృష్ణ సుబ్బారావు
జమైకా

గొడ్డు చర్మం
మట్టి బుర్రా
అడ్డ చుట్టా
హీనంగా చూడకు దేన్నీ
ప్రాణం కద పదవికివన్నీ!
విల్సు ఫ్లేకూ
పూలస్లాకూ
చేతబాకూ
కావేవీ చదువుకనర్హమ్..
ఛ..ఛ. చదువో విలాసపర్వం..!
ఐటెక్స్ లిప్‌స్టిక్
హైహీల్ టిక్ టక్
స్లీవ్ లెస్ జాకెట్
నీకేసి చూస్తూ ఉంటాయి..
కవ్విస్తూ పిచ్చెక్కిస్తాయ్
వుండాలోయ్ ఆత్మనిగ్రహం
ఛండాలం కామోద్రేకం
దొరకదటోయ్ సత్సాంగత్యమ్!?
కళ్ళుంటూ ఉంటే చూసేయ్
పళ్ళుంటే ఇకిలించేసేయ్
ప్రపంచమొక రంగులరాట్నం
పరుగిడితే బ్రతుకిరకాటం!
(శ్రీశ్రీ గారికి క్షమార్పణలతో)

***

ఎదురుచూపులు సి.హెచ్.నాగభూషణ రావు
శ్రీకాకుళం

గలగలా పారే నీటి సవ్వడి కనుమరుగైంది
పచ్చని పైరుగాలి వేడెక్కి పోయింది
పక్షుల కిలకిలలు మూగబోయాయి
భానుని తాపానికి ప్రకృతే రూపం మారిపోయింది
ఒక్క చినుకు కోసం
పుడమితల్లి
అడవితల్లి
ప్రకృతి వల్లి
ఎదురుచూపులు
తొలకరి జల్లులు కోసం
పరుగులు తీస్తున్నా మేఘాలకోసం
మబ్బులచాటున దాగిన భానుడి ప్రతాపం తగ్గుతుందేమోనని

బీడువారిఉన నేల
మోడువారిన చెట్లు
చల్లదనంకోసం పరుగులు తీసే సమస్తజీవులు
చూసే ఎదురుచూపులు
ఫలించేవేళ
కురుస్తున్న వర్షాలు
ప్రకృతి అందాలు తీసుకొచ్చిన వేళ
నీటి సవ్వడుల రాగాలు
సమస్తజీవకోటికి వరాలు
ఎదురుచూపులు ఫలించే వేళ ..!

***

# పడమటి తీరం

## నట్టి శివపార్వతి

**అర్థరాత్రి ఆకాశంలో చుక్కల్ని లెక్కపెడుతూ**

పూర్ణచంద్రుడూ నేనూ - ఒకరినొకరం చూసుకుంటూ,
సరళరేఖపై సమాంతరంగా
పడమటిదేశానికి పయనమయ్యాం.
సముందరుడు తప్ప మరింకేమీ కానరాని నీలాకాశంలో
నింగీ నీరూ యేకమై, అంతా ఒహటే శూన్యంగా
అనంతవిశ్వంలో అతిసూక్ష్మ బిందువులా
అంతరంగంలో ప్రతిధ్వనిస్తూన్న ప్రణవస్పందనతో
నేనూ చంద్రుడూ తమకంగా ఊసులాడుకుంటూనే ఉన్నాం
అప్పుడప్పుడూ హిమశిఖరాల్లా
విమానయానానికి అడ్డుతగులుతూ
దూదిపింజల్లా తరలివస్తూన్న మంచుమబ్బులా..అవి!?
కాదు..కాదు..కానే కాదు..
అర్థనారీశ్వరుని లయవిన్యాసంతో
చెదిరి చిందులు వేస్తూ, భువికి జాలువారుతూన్న
హిమశిఖరపు 'తలంబ్రాలు'
పుష్పక విమానంలోని దేవకన్యలా
విశ్వదర్శనంలో తేలియాడుతూన్న
నా అంతరంగపు విన్యాసం ఏమని చెప్పను?
అక్షరమాలతో బంధించలేని పరిజాత సుమ సౌరభాలనీ
'నారద తుంబుర' నాదాలనీ
కైలాసనాధుని కదనకుతూహల ఢమరుక లయవిన్యాసంతో
సాగర తరంగాలలో లీనమైపోతూన్న శయనింపు రాగాలనీ
అంబరాన్ని చుంబించిన అనంత నాధుని చరణముద్రనీ
చిన్మయాకాశంలో తన్మయంగా
అండపిండ బ్రహ్మాండమంత ఆత్మానందాన్ని అనుభూతిస్తున్న వేళ
యెవరో నెట్టినట్టయి - ఉలికి పాటుగా చూశానా!
చంద్రుడూ నేనూ..ఇంకా..
పక్కపక్కనే పయనిస్తూనే ఉన్నాం..! ***

## నశ్వరం — రవి వీరెల్లి

**కనురెప్పల సవ్వడితో**
కటికి చీకట్లను తరిమి
నీ లేలేత కిరణంతో
నింగికి ఉదయవర్ణం పులిమి
నీ ఆలోకనంతో
లోకంలో కోలాహలం రేపి
నేనే రాజ్యాలకు రాజంటూ
రోజంతా నెత్తికెక్కుతావు!
నీపై ప్రేమ పొంగి
కారుమేఘం కరిగి
వలపుల కులుకులు కురిసిందని
సప్తవర్ణ సంతకం చేసావు.
నీ తాపం తట్టుకోలేక
నీలాకాశం నడిసంద్రంలో మునకేసి
నీలాంబరాలు నీటికి అరువిచ్చిందని
ఆకాశానికి కాషాయం ఓణీ చుట్టి
ఎరసంజ సాంబ్రాణి వేసావు.
తొలిదిక్కును కవ్విస్తూనే
మలి దిక్కుతో జతచేరి
నిలకడలేని నువ్వు
నీతో పాటే..
పుసిన రంగులన్నీ మూటకట్టు కెళ్తూ
నీ ఈ లోకాన్ని అంధతమసం చేసావు..
రెప్పపాటు కాంతులు
గుప్పెట్లో ఎరగా పట్టి
మరోకొత్త రోజుతో మళ్ళీ వస్తావు
అహస్సు తమస్సుల కలయికలో
నిషస్సులు ఉషస్సులు సహజమంటూనే
అంతా నశ్వరం అంటూ..

***

## కలలు — రాగద్వీప

**నా కలలెప్పుడు నన్ను వెంటాడుతూనే ఉంటాయి**
నా పగలెప్పుడు నా కలలను వణికిస్తూనే ఉంటుంది
పరుగెడుతూనే ఉంటాను
కాళ్ళూ కదలవు , దూరమూ తరగదు
ఆవేశంగా ఆ చెంపలు వాయిస్తూనే ఉంటాను
నా చేతులెప్పుడు ఆ చెంపల్ని తాకనే లేవు
నడుస్తూనే ఉంటాను
నా నగ్నదేహాన్ని కప్పుకోనే లేను
అస్పష్టమయిన దృశ్యాన్ని స్పష్టంగా చూడాలని
కళ్ళు పూర్తిగా తెరవాలని గింజుకుంటుంటాను
రెప్పలు అతుక్కునే ఉంటాయి
ఉపిరాడక ఉక్కిరిబిక్కిరవుతూంటాను
నొక్కిపెట్టే అదృశ్యశక్తిని విదిలించనే లేను
ఇలలోని నన్ను నా కల మళ్ళీ మళ్ళీ గుర్తు చేస్తుంది
నా నుండి నేను పారిపోవాలన్న నా ప్రయత్నాన్ని మళ్ళీ
మళ్ళీ తిప్పికొడుతుంది

***

## వింగ్స్

కోసూరి రవికుమార్
దాచేపల్లి

అన్నిటినీ
కలుపుకు పోవటమూ
బాధలు దాచుకుని
ముందుకురకటమే అలనైజం

సముద్రం
ఆగిపోని పాఠం

----

కాలుతుంది
బాధగానూ ఉంటుంది
కనబడని నొప్పి
కట్టి పడేస్తుంది

ఆకలి
ఒక దహించే నిజం

---

తన మానాన
తను వెళ్ళదు
నీలా
నాలా

కాలం
ఒక సముద్రపు అల!

***

## ఎందుకు

ఎస్.ఆర్.బందా

.......మరో కట్ గ్లాసు పగులుతూ కనిపిస్తోంది
చెరో వైపుకీ జరిగిపోతూ చెలిమి కరువౌతున్నట్లనిపిస్తోంది
నాలుగు లేత క్రనెప్పలు కరుగుతున్నట్లనిపిస్తోంది
మరెన్నో తడి క్షణాలు వేడెక్కి ఆవిరౌతున్నట్లనిపిస్తోంది

మొదటి నెత్తుటి సౌకుమార్య విచ్ఛేదనకన్నా
రెండవసారి జారిన తాదాత్మ్యపు మూర్ఛనకన్నా
మూడో మునకలో మోక్షం కన్నా
నాలుగో చుక్కలో మెరుపుకన్నా

నిశ్శబ్దంగా గింగుర్లెత్తే అరుపులమధ్య
అతి రౌద్రంగా గీసే గీతలమధ్య
గాలికెగిరి మాయమయే ఇసుకకణాల్లా
కలిసి కరుగుతున్న పదాలెన్నో!

చిక్కని అవగాహన పల్చనై
మెరిసిన చిరునవ్వు విరిగిన మోడై
పల్చటి ఎముక తూష్ణీరమై
.....
.....
..
ఎందుకు..ఎందుకొరే దేవుడా
విడాకులెందుకు????????

***

# మృదుస్పర్ధలు - డా.గరిమెళ్ళ నారాయణ

**నాకూ ఆమెకూ మధ్య** ఒక ఆక్వేరియం.. ఒక పంజరం.. మరికొన్ని వనాలు
ఆమెకూ ప్రపంచానికీ మధ్య కుండీల్లో మొక్కలు
నాకూ ప్రపంచానికీ మధ్య అనాగరికమైన అరణ్యాలు
నేనూ చేపల్నీ, పక్షుల్నీ, జీవుల్నీ ప్రేమిస్తాను,
తనూ ప్రేమిస్తుంది!
నేనేమో స్వేఛ్ఛా జీవులను,
తనేమో ఇంటికి తెచ్చిన వాటినీ.
తన అవ్యాజ్యమైన ప్రేమ, రక్షణ
పంచడం కోసం
గోడల మధ్య బందీలైనా
గోడల లోపల స్వేఛ్ఛా జీవులే కదా అని ఆమె వాదన!
మనిషికి తప్పని గోడలని
జీవాలకు అంటించకుండా
ఎల్లలెరుగని స్వేచ్ఛలో తిరుగాడనివ్వాలని నా వాదన!
నేను వీధిలో పావురాలకు గింజలేస్తే
ఆమె ఇంట్లో చేపలకు పక్షులకు తిండి పెడుతుంది,
నేను అరణ్యాలలో తిరుగుతూ ఆస్వాదిస్తుంటే
తను ఇంటి బయట మొక్కలకు నీళ్ళుపోస్తూ
చిలకలతో కబుర్లు చెబుతుంది!
విజాతి ధృవాలు కలిసుండడమే లోకానికి రివాజైనప్పుడు
నేను నిరంతరం అడవులని
ఇంటిని కప్పేయమని అహ్వానిస్తుంటాను,
ఆమె పంజరాలనీ అక్వేరియములని
విశాలంగా మారుస్తూ వాటిలోకి
రక్షణ బాధ్యతను ఆహ్వానిస్తూంటుంది!
స్పర్ధలు ఎంతకీ సమసిపోవు
ఐతే ప్రపంచమంతా అడవిగానైనా మారిపోవాలి
లేదంటే అడవులన్నింటా రక్షణ బాధ్యతైనా వహించాలి. ***

## ఉద్భ్రాంత పాంథుడు
### ఎలనాగ

**తెలిసినట్టే ఉంటుంది**
కాని అడవి దారి తెమలదు
వెళ్ళేది సరైన దిక్కనే తోస్తుంది
అయినా నావ తీరం చేరదు
ఎరిగినవే ఎడారి దారులు
ఎంత తిరిగినా పొలిమేర అందదు
ఇలాంటిదే మరి మనిషి జీవితం!
దుర్గమారణ్యం
దృగంత పర్యంత సాగరం
దిగంత పరివ్యాప్త సైకతం
మరీచికలల్లిన మాయదారుల
మాయాజాలం!
దారి తప్పిన తెరువరై పరిభ్రమిస్తుంటాడు
ఉద్భ్రాంత పథికుడు మానవుడు

***

## కనులు - మనసు
### కిశోర్‌కుమార్

**కనులు రెప్పల చాటున దాగినంత మాత్రాన**
మనసు వీక్షించడం మానదు!
రెప్పగారి అనుమతి కనులకు లభించినా
మనసుని మైకం నుండి మరల్చలేవు!
అసత్యం కనులను భ్రమింప జేసినా
మనసు తలుపులను తెరువజాలదు!
సున్నితత్వం కనులకు కానరాక పోయినా
మనసు ఆహ్వానం పొందక మానదు!
తీక్షణ వెలుగు రేఖలని కనులు తాళలేకున్నా
మనసు వాకిట ఆ రేఖలే ముగ్గులాయేను!
నిశిరాతిరి కనులకు చీకట్లు నింపినా
మనసు లోతుల్లో హాయి అనే వెలుగులు నింపేను!!

***

# అమ్మా.. నీకు అమ్మగా మారాలని ఉంది
## వారణాసి మహాలక్ష్మి , విజయనగరం

**కాలితో నిన్ను తన్నిన గుండెలకి హత్తుకున్నావు ,**
ఆ పాదాలకి ముద్దులు పెట్టి, మువ్వల పట్టీలు తొడిగావు ,
బుడి బుడి అడుగులు నేను వేస్తుంటే ,
నువ్వు ఈ ప్రపంచాన్ని గెలిచినంత ఆనందపడ్డావు,
అమ్మ , అత్తా , తాత అంటూ నేను మాటలు నేర్చుకుంటుంటే
నాకు నీ మాటలు అర్థం కావేమో అనుకోని నా కోసం నా బాషని నేర్చుకున్నావు ,
అం తింటావా , బొంబ్బ కావాల, చాకోస్ , బిక్క తింటావా
అంటూ నా భావాలకి అర్థాలు ఈ ప్రపంచానికి చెప్పావు .
వర్షంలో తడిసి వచ్చిన ప్రతిసారి అయ్యో తల్లి తడిసిపోయావా
అంటూ నా తలని నీ చీరకొంగుతూ తుడిచి నాకు జాగ్రత్తలు చెప్పేదానివే గాని ,
నాకోసం నువ్వు కూడా వర్షం లో తడిసావని , నా తలని తుడిచిన
నీ చీర కూడా తడిసిపోయిందని ఏనాడూ గుర్తిస్తావ్ అమ్మా ..
ప్రపంచాన్ని సైతం ఒంటరిగా ఎదిరించగలిగే నీ ధైర్యాన్ని చూసి గర్వపడనా ??
లేక నా కాలిలో చిన్న ముళ్ళు గుచుకున్న నీ కళ్ళలో కనిపించే కన్నీటి సంద్రాన్ని చూసి జాలి పడనా??
నా మాటలలో అర్థాన్ని, నా మౌనంలో అంతరార్థాన్ని గ్రహించగలిగే నీ తెలివిని చూసి ఆశ్చరాపడనా ??
సూర్య చంద్రులు సైతం రోజుని పంచుకొని పని చేస్తారు,
నువ్వు నా బాధ్యతని పంచుకోకుండా ఎలా చూసుకోగలుగుతున్నావ్ ?
కనీసం నాకైనా నా గురించి అలోచించుకొనే అవసరాన్ని, అవకాశాన్ని ఇవ్వవు కదా!!
పంచభూతాలకి సైతం కోపం వస్తుంది కదా అమ్మా...!?
గాలి కి కోపం వచ్చి సుడిగాలిగా మారుతుంది ,
నీరు కి కోపం వస్తే సునామిల విరుచుకుపడుతుంది ,
నిప్పు కి కోపం వస్తే దహించేస్తుంది,
భూమి కి కోపం వస్తే భూకంపాన్ని సృష్టిస్తుంది,
ఆకాశానికి కోపం వస్తే పిడుగులని కురిపిస్తుంది.
మరి నీకు కోపం రాదా ?
అందుకే అంటారేమో సృష్టిలో అన్నిటికన్న గొప్పది అమ్మ అని.
అమ్మ ప్రేమలో ఎంత మాధుర్యం ఉందో తెలిసి కూడా నాకు జన్మ ఇవ్వడానికి
నీ కన్నతల్లిని కూడా వదులుకొని కొత్త ప్రపంచం లోకి అడుగుపెట్టావు .
నాకు ప్రాణం పోస్తే నీ శక్తి అంతా పోతుందని తెలిసినా ఆనందంగా నాకు జన్మని ఇచ్చావు ,
ఆకలి వేసి ఏడిస్తే నీ రక్తాన్ని పాలుగా మార్చి నా కడుపు నింపావు ,

చలికి వణికి పోతుంటే నీ స్పర్స లోని వెచ్చదనాన్ని రుచి చూపించావు .

నాకు సేవలు చేయడానికి పనిమనిషిగా,
నన్ను కాపాడుకోవడానికి అంగరక్షకురాలిగా,
నాకు జీవిత పాఠాలు నేర్పడానికి గురువుగా,
నాకు ఆనందాన్ని పంచడానికి నా చేతిలో బొమ్మలా మారవు .
నీ శక్తిని కొంచెం కొంచెంగా నాకు పంచుతూ
ముసలి రూపుని నువ్వు తీసుకుని
నీకంటే అందంగా, శక్తీ వంతురాలిగా నన్ను తయారు చేసావు .
నాకోసం నువ్వు ఇన్ని చేసిన ఇంకా నాకొక కోరిక మిగిలే ఉంది.
" అమ్మ నీకు అమ్మగా మారాలని ఉంది" .
నువ్వు నన్ను చూసుకున్నంత జాగ్రత్తగా , ప్రేమగా చూసుకోలేనేమో కాని
" అమ్మ " లా చూసుకోగలను. ***

## కోరిక - ఉమ చింతలపాటి

**గమ్యాన్ని త్వరగా చేరాలని లేదు** కాని ఈ ప్రయాణం మధురం కావాలని వుంది
కోకిలలా గానం చేయలని లేదు కానీ  సుమస్వరాలలో  తేలియాడాలని వుంది
వరాలు వెనువెంటనే పొందాలని లేదు భక్తి భావంలో తన్మయత్వం చెందాలని వుంది
ఇటు అటు పరుగులు పెట్టాలని లేదు తన ప్రేమె లోకంగా వొడిలో వొదిగి పోవాలని వుంది
వింత లెన్నో చూడాలని లేదు నా కనుల నిండా తన రూపే నిండి పోవాలని వుంది
ఎన్నో కబురులు చెప్పాలని లేదు పెదాలు తన పేరు మాటి మాటికి పలకాలని వుంది

***

# చెలీ

## స్వాతీ శ్రీపాద

చెలీ
నా కనుపాపల పల్లకీ నెక్కించి
స్వప్నవీధులగుండా
గుండె నెత్తావులను వెదజల్లుతూ
నేను నలుగురినై
జీవితం పందిట్లోకి
మోసుకుపోతాను!
నా గాఢ పరిష్వంగం వెచ్చదనాన
ఒదిగి పొదిగిన నిన్ను
ప్రేమాధి రోహణ అనుభూతుల్లో
జగమంతా ఊరేగిస్తాను!
అలసి సొలసి
నిట్టూర్పుల సెగలో చలికాచుకుంటూ
కందిన నీ లే చెక్కిళ్ళగులాబీ రెక్కలమాటున
మధుపంగా ఒదిగిపోతాను!
ఏళ్ళ క్రితం చూపుల రాయభారాల్లోని
నిశ్శబ్ద గమకాల్ను శృతి చేసి
రాగం కట్టిన పాట రక్త నాళాలను చేదించుకుంటూ
పెల్లుబికి వస్తోంది.!

అత్తరు సువాసనల అట్టడుగునో
గాజు గోళీ కళ్ళకావలి తీరంలోనో
సముద్రంలా అడ్డంగా పరచుకున్న లోకానికి
ఈ వైపునో ఆ వైపునో
ఇంకా నీ నవ్వు సవ్వడి గాలానికి
నన్ను నేను తగిలించుకుంటూనే వున్నాను!
నడి రాతిరి ఇల్లంతా పరచుకున్న ఏకాంతం
అడుగడుగునా నీ పాదాల ఒత్తిడి
రాత్రిని జ్ఞాపకాల మూసలో కరిగించి నీ కోసం
పుటం పెట్టిన అక్షరాలను
ఆభరణాలుగా మెరుగులు పెడుతున్నాను
ఏ అలసిన ఉదయపు క్షణాల్లోనో
ఓ చల్లని ఓదార్పు లా నీ స్పర్శ
లాలిస్తుందన్న ఆశతో
కను రెప్పలు మేను వాలుస్తున్నాయి
గాలి అల్లరిగా సంధించిన
ఉలి ములుకుల్లా నిశ్శబ్దంగా దూసుకు వచ్చి
నీ రూపం పచ్చబొట్టు
నా ఉనికిపై చెక్కుతున్నాయి
చెలీ
ఇహ నేనెక్కడ?
ఇటూ అటూ ఎటు చూసినా
జ్ఞాపకాలే ***

# నేటి బతుకు — బి.గీతిక, పాలకొల్లు

**కనుల మాటున కలల లోతున**
ఆవలి తీరంలో
వెతికి వెతికీ అలిసి  పోయి
దొరకని అస్థిత్వం కోసం
కలవర పడుతూ కళ్ళు తెరిస్తే-
ముగియని నిన్నటి వర్ణచిత్రంలా
ప్రశ్నార్థకమై ఎదుట నిలుస్తావ్.
నాలో నాకే
సంధి కుదురుస్తావ్.
బతకడానికి
ఏదో ఒకటి చెయ్యాల్సిన
సమాజ నీతితో
అడుగు కలిపి ముందుకెళ్తే-
అవమాన అవరోధాలతో
క్షణ క్షణమూ
చివుక్కుమంటున్న మనసు
కాలే కడుపుని
నిజంగానే కాల్చేస్తుంది.
ఆకలే ఆత్మ ఐ
అన్నమే దేవుడంటుంటే
ఇంకా సమాధానం దొరకని
ఓ మొండి ప్రశ్నలా
అటూ ఇటూ చూస్తాన్నేను
ఆశగా ఆకలిగా!
అన్నం కంటే ముందు
శ్రమ, స్వేచ్ఛ, నీతి, నిజాయితీలకై
అర్రులు చాస్తుంటే తెలిసింది
అవినీతి మాత్రమే
కడుపు నింపగలదని!
డొక్కలంటిన పొట్టతో
న్యాయదేవత త్రాసులో
నే ఒకవైపు నిలబడ్డా
కనే కనిపించని ఆకలి
నాతో తూగి నన్నోడించింది.

మనస్సాక్షా? కలా?
ఏది ముఖ్యం??
ఒక్కడ్ని.
నాకీ నీతీ న్యాయం
ఏం సాధించాలనీ?
నేనే కాదు నా మనసూ ఓడిపోయింది
ఆకలి ముందు!
మాటల గారడీలు,
నవ్వుల శరాలూ
గురిచూసి సంధిస్తే
ఇన్నాళ్ళెరుగని
భావ చైతన్యమేదో
మనసుని ఉత్తేజపరిచింది.
నా మనసు, లోచనా
ఇంకా చచ్చిపోలేదా?
మాయా ప్రలోభాల్లో
నలుగురూ పడిపోతుంటే
నా కడుపే కాదు
జేబూ నిండుతోంది.
అలసిన మస్తిష్కంతో
ఆర్ద్రత కోరే గుండెతో
కునుకై క్షణం కనుమూస్తే
కనుల మాటున కలలలోతున
ఊహాలోకంలో
అంతమవని అన్వేషణేదో
నా అస్థిత్వాన్ని వెంబడిస్తూ
కళ్ళు తెరుస్తుంది.
అసలా అస్థిత్వమన్నదే
శూన్యమని గ్రహించిన
ఆ వేకువ ఝామున-
ఇంకా ముగియని నిన్నటి వర్ణచిత్రంలా
బతుకు చిత్రం కొనసాగించమని
ఎదుట నిలుస్తుంది
క్షణ క్షణానికీ నాలోని నన్ను చంపేస్తూ..!! ***

# ఆత్మవేధ - దాసరాజు రామారావు

**కిటికీ రెక్కలు విప్పి**
పద్యాన్నెగరేద్దామనుకున్ననో లేదో
బిగ్గరగా పూలగోల-
స్వప్న పలకల ఒంటి స్తంభం మేడ
కుప్ప కూలింది
అగరుబత్తీల మొహబ్బత్ పొగలకు
ఆకాశానికి వూపిరాడ్డం లేదు
కళికెడు కన్నీటి చెలిమల్ని
వడకట్టలేదని
పెరటి కరివేపాకు మొక్క
అగ్నిప్రవేశం చేసింది
రహదారి బంగరు వడ్డాణాన్ని మడిచి
జేబు పక్క సొరగులో దాచుకున్న -
కొండచిలువై ఝాడించి,తప్పించుకున్నది
నర్మగర్భాల్లేని రాజస్తానీ మీగడ సోకుల్ని,
పగడపు పరిభాషని
అక్కడెక్కడో దాచేసి ,
గేటుని విశాలంగా తెరిచిందా పిల్ల
పిలుపుల్ని దులిపిన వొట్టి చేతులతో-
నడిజాము రాత్రయితే చాలు-
మొండితోక కుక్కకు
సీతమ్మ వారి కష్టాల హరికథా గానమే
తెల్లారిందాకా-
పురాణ పురుషులెవరూ అటుగా రారు,
వరమేదైనా ఈయరు
తొవ్వల రెక్కలు విరిగిన
సీతాకోకచిలుకలు -
గాబరాగా గెంతుతున్న
తెల్ల కుందేళ్ళ పిల్లలు-
మెడకురివడ్డ
బంగారు పురుగులు-
మరో ప్రపంచ నిర్మాణానికి
అతారలకై
పరుగుల వేట-

అరిగిన బలపంతో
షట్చ క్రవర్తుల్ని గీయలేరు
పలిగిన పలకలో
ప్రజాస్వామిక ఎల్లలు లిఖించలేరు
పసితనం
పాపం కూపం లో కొట్టుకుంటున్నది
వేణువుని కత్తిపోట్లకు గురిచేసి,
రాగాల్ని దొంగిలించి నతను
సత్యాగ్రహ శిబిరంలో
దండేసుకున్నా డు
తెగిన శిరసొకటి
చెట్టుకు వేలాడుతున్నది
గాలిపటమై-
కనురెప్పలపై
కందిరీగల కవాతు..
నాసిక మీద
గండుచీమల దండయాత్ర...
పెదవుల మీద
గున్న ఏనుగుల పరుగు పందెం....
చౌరస్తా లోని ప్రజానాయకుని విగ్రహం పక్కన
నిలబడిన-
అయినా, దాడి గేట్టు లేదు
గాలి కెరటాల మీద బాదుతూ
అరుస్తున్నారెవరో-
శృతి,లయ మేళవింపులో
ప్రవహిస్తున్న
సముద్రం మధ్యన
పద్మవ్యూహం జ్వలిస్తున్నదని......

రా
నాతో
నాలుగు అడుగులు వెయ్!

***

# అందమైన అనుభూతి
## ఆచళ్ల శ్రీనివాసరావు

నా చిన్ననాటి ఉల్లాసమంతా
నాలో పునరుక్తి కావడానికి-
యిన్ని సంవత్సరాలు పట్టింది.
నీవు తిరిగి యిచ్చే వరకూ ,
ఉత్సాహంగా జీవించవచ్చనే-
నా విశ్వాసాన్ని సైతం
ఎవరూ ఆమోదించలేదు .
నిన్ను ప్రేమించేదుకు
సర్వ శాశ్వతత్వం
కావాలి నాకు.
ప్రియతమా !
ఈ వియోగం దుర్భర భరితం .
కాలం కరిగిపోతోంది
ఎన్ని నాళ్ళ వియోగం లోనూ
నిన్ను కోల్పోలేను.
నీవు నాలోనే వున్నావన్న
అనుభూతిని ఏ క్షణమూ -
...వదులుకోలేను.

***

# అవతరణం
## టి.శ్రీవల్లీ రాధిక

మనుషులే లెక్కచేయని
మత్స్య కూర్మ రూపాలతో
మదాంధ రక్కసులని గెలిచావు
మోహిని రూపంతోనే కాదు
వరాహమూర్తిగానూ
మనసులని దోచావు!
పసివాడు పిలిస్తే
పరమభయంకరాకారంతో కనిపించావు
బలశాలి గర్వమణిచేందుకు
బడుగు బాపడివై అరుదెంచావు!
మనిషిలా మసలి
మహనీయులతో మొక్కించుకున్నావు
దేవుడ్నీ నేనంటూకూడా
దుర్జనుల తిట్లే దక్కించుకున్నావు!
అంతకుముందెపుడో ...
అమ్మనైనా చంపేంత
ఆవేశాన్ని కనపరిచావు
అంతలోనే ...
అసాధ్యమనిపించేంత
అహింసనీ బోధించావు

ఒడుపు తెలీకుండా వెతికేవారికి
వేల వైరుధ్యాలతో అగుపిస్తావు
ఒదిగి నిన్ను కొలిచేవారితో
అసలు రెండు లేనేలేవని అనిపిస్తావు

***

# నా తపన -ఇందిర మందడి, కెనడా

ముదమున ముదిమిని గొంటిమి
మాకేమి అదృష్టమో మరి
కడుపున కాసిన కాయలు అమ్మబోయె
తమతమ నెలవుల సుఖములు గన్న
మరి మా తలపేల?
ఎపుడో తళుక్కున మెరిసి ఆశా రేఖల పొడిగించి
మరి కొంత కాలమీ బడుగు బాధలకోర్వమని శాసించె
నా ప్రియ తనయుల నేమనను
ప్రయాసము నధిగమించి దరిజేర
వంశాంకురంబులు తెల్లబోయె
ఈ తాతమ్మలు వేషభాషలందు లెస్స
మరి మాకేల ఈ విషయములని ఎడ మాయె
ఎటుబోతు నేమిసేతు ఈ యంత్రాంగముల నడుమ
నా ఈ కలత ఎవరితో చెప్పను ?
నా దేశభాషలను నే మరువకున్నాను
మరి నే నెక్కడ ఇమిడెదనో నాకే తెలియదు
నా ఈ తపనను పంచుకునేవారెవరూ లేరా ?

***

# అక్షరం

డా.గంద్ర లక్ష్మణరావు

మనోభూమిక ఆర్ద్రమైనపుడు
అంకురించేది అక్షరం
సమాజం స్తంభించినపుడు
చైతన్యకెరటం అక్షరం
చైతన్యం ప్రవహించినపుడు
ఉత్తుంగతరంగం అక్షరం
ఉద్యమం ఉదయించినపుడు
మధ్యాహ్న మార్తాండ చండప్రచండం అక్షరం
బాధాతిమిరాలు కమ్మినపుడు
ఓదార్పు కిరణం అక్షరం
ఆనందం జలపాతమైనపుడు మధురగీతమయ్యేది అక్షరం
అపసవ్యంగానో అక్రమంగానో నడుస్తున్నపుడు
అసలైన దిశను నిర్దేశించేది అక్షరం
పశు ప్రవృత్తి విజృంభించినపుడల్లా
ఋషితత్వాన్ని తడిమి చూపేది అక్షరం
అనుభవాలకు, ఆలోచనలకు
ఆశయాలకు, ఆచరణలకు
అనంత మానవ ప్రయాణానికి
అచ్చమైన సాక్ష్యం అక్షరం
రంగులకు భంగిమలకు
పొంగులెత్తే భావాలకు
పోతపోసిన రూపం అక్షరం
బ్రతుకు నీరసంగా నీరవంగా మారుతున్నపుడు
పలుకు తోడయి సారసంగా సుస్వరంగా నిలిపేది అక్షరం
కాలగతిలో పరిణామాలెన్ని ఎదురైనా
క్షరం కాని సత్యం అక్షరం..! ***

## అమ్మ అక్కడే ఉంది
## బి.హెచ్.గవాస్కర్, కువైట్

అమ్మ అక్కడే ఉంది..
నీకీ జీవితం ప్రారంభమైనప్పుడు, నీకీ ప్రపంచం కొత్తైనప్పుడు
నీకు ఆకలైనప్పుడు, పక్క తడిసినప్పుడు, నిద్ర వచ్చినప్పుడు
అమ్మ అక్కడే ఉంది..
నీవు నడక నేర్చినప్పుడు, నీకు నడత నేర్పినప్పుడు
ఉషోదయాన నిన్ను పక్కమీద నుండి లేపినప్పుడు,
నిన్ను బడికి పంపినప్పుడు
అమ్మ అక్కడే ఉంది..
నీ చదువు సంధ్యల్లో సాయపడ్డప్పుడు, నీ మంచి చెడుల్లో మార్గదర్శైనప్పుడు
రాత్రుళ్ళు నీతో ప్రార్థనలు పలికించినప్పుడు,
నిద్రలో పీడకలల నుండి నిన్ను ఓదార్చినప్పుడు
అమ్మ అక్కడే ఉంది..
నీ అభిప్రాయాలను వినడానికి, నీకు  సలహాల నివ్వడానికి
నీ మనసు గాయపడ్డప్పుడు, దెబ్బతిన్నప్పుడు,
నీకు  ధైర్యాన్నివ్వడానికి
అమ్మ అక్కడే ఉంది..
ఈ ఉన్నతిని, భోగభాగ్యాలను కళ్ళారా చూసి
ఊర్థ్వలోకాలకేగినా, ఆ ప్రేమ అమరంగా అక్కడే ఉంది
నీ హృదయంలో ఉంది..అమ్మ అక్కడే ఉంది.!! ***

## స్వార్థం
## సన్నిహిత్, హైదరాబాద్

చెలీ-
పూలకు తెలియని పరిమళం
నీ మేనికి సొంతం,
కోయిలకెరుగని రాగం
నీ స్వరమున పదిలం,
భాషకు తెలియని మధురం
నీ పలుకుల అందం,
హొయలొలికే నీ గమనం
పారే నదులకు పాఠం,
విరజిల్లే తారల తళుకులు
నీ నవ్వుకు సొంతం,
కానీ-
నీ మనసుకు తెలియని ప్రేమ
నీపై నే కురిపించే ప్రేమ
నాకే సొంతం,
అది నేను పెంచి పోషించిన
నా తియ్యటి స్వార్థం!

***

# హృదయ మథనం

విజయ చావలి, ఆస్ట్రేలియా

కదిలిస్తే హృదయ మథన మౌతుంది
కలిపి రాస్తే కథ లవుతాయి
వినిపిస్తే  వ్యధ లవుతాయి
చెదిరి గొంతు కలిపితే చేదు నిజాలవుతాయి..!
కూలి కోసం
కూటి కోసం
పొట్ట పట్టుకు తిరిగే
బడుగు జీవులను
వారి వేతనంలో వాటా కొట్టే వారి గూర్చి
కదిలిస్తే హృదయ మథన మౌతుంది..!
మాట నమ్మి
మూటలమ్మి
నమ్మిన వారిని వంచించి
తోటి వారిని సందేహించి
వాడెవడో చేయి కలిపి నడుస్తాడని
మాయమైన మగాడి కోసం వెదకి వేసారి
అమాయకంగా
ఆశాజనకంగా
పట్నం చేరిన పడతిని
కదిలిస్తే హృదయ మథన మౌతుంది..!
వున్న వూరికి దూరంగా
కన్నవారికి ఆధారంగా
నిలవాలని వుద్యోగంలో స్థిరపడాలని
కళ్ళనిండా ఆశలతో కలిసి వచ్చి
వున్నదంతా వూడ్చి పెట్టి కదలి వచ్చిన
నిరుద్యోగిని పరారైన దళారీ గూర్చి
కదిలిస్తే హృదయ మథన మౌతుంది..!
పైస పైస కూడబెట్టి
నిలవగలిగిన చిన్న వ్యాపారస్తుడ్ని
ప్రకృతి కోపాగ్నిలో మసి మాడై
వున్నదంతా వరదల్లో మాయమై
నిలువనీడ లేని గరీబు జనాన్ని
కదిలిస్తే హృదయ మథన మౌతుంది..!
ర్యాంకు లో సీటు గెలిచి
ఎంతో సాధిద్దామని కాలేజి చేరిన
యువతిని ఓ యువకుడు
ప్రేమా దోమ అంటూ వేధించి
వినకుంటే వేసారి కత్తివేటుకు గురి చేస్తే
పలకరిస్తే బావురుమన్న తల్లితండ్రులను
కదిలిస్తే హృదయ మథన మౌతుంది..!

## సంకెల
### కె.క్ష్యాబ్‌వర్మ, విజయనగరం

ఏదో ఖాళీతనం వెంటాడుతోంది..
దాపరికం లేనితనం
కాలు నిలవనీయడంలేదు..
ఆవరించుకున్న మబ్బులనుండి జారే
తేనె చినుకులకై ఆత్రంగా పైకి చూపు..
హఠాత్తుగా మెరిసిన మెరుపు
గురిచూసి గుండెల్లో దించిన బాణం...
వేలిచివర మిగిలిన చివరి బొట్టు
తిరిగి ఒళ్ళంతా పాకి
నిలబెడుతున్న క్షణం..
రవ్వంత వెలుగుతో సృష్టిస్తున్న
కాంతివలయం!
పొందికలేని పదాల కవితమల్లే
చిందర వందరైన లోచనల గుబురునుంచి
బయటపడలేనితనం!
పరుగు కోసం వేసిన మొదటి అడుగు.
మడమకు అడ్డంగా పడి చీరుతున్న సంకెల ?

***

## జీవితం
### జె.బి.వి.

జీవితం
మూడక్షరాల నిండుసున్న
నీ ఆశ, కృషి నిర్ణయిస్తాయి
నీ అంకె విలువెంతో
నీ గుండె బరువేమిటో
నీ ఆలోచన స్థాయి ఎంతో!
జీవితం
మూడు రోజుల పండగ
అశాశ్వతంలో శాశ్వతత్వం కోసం
మనిషి పడే ఆరాటంతో
వేసుకొనే రంగురంగుల రంగ వల్లికలు
చేసుకొనే సంబరాల పరంపరలు!
జీవితం
పంచ రంగుల కల
కట్టుకున్న మేడలు
చెప్పుకున్న మాటలు
కనురెప్ప పాటులో
చెక్ చెప్పేస్తాయి
మనిషిని దిగ్భ్రాంతుడిని చేసేస్తాయి

***

# చెట్టు - మెట్టు
## న్యాయపతి వెంకటమణి, విశాఖపట్నం

**చెట్టు నా ఆదర్శం అనుకోమంటే  చక్కగా ఒప్పుకుంటాను కాని**
మెట్టు నా ఆదర్శం అంటె మనసు పాడు చేసుకుంటాను
వసంతం వచ్చిందంటే
చక్కగ చిగురించి పుష్పించి ఫలించి
చిన్నారుల కందించి త్రుప్తి చెందుతుంది చెట్టు
ఆ త్యాగంలొనె ఒక ఆనందం
ఆ అర్పణలోనె ఒక నిండుతనం
అనుభవిస్తుంది చెట్టు
కాని -
తనపై కాలుంచి పై పైకి వెళ్ళి
మరి తిరిగి చూడని స్వార్థపరులకు ఆలంబన మవుతుంది మెట్టు
ఒక వసంతం లేదు, ఒక త్రుప్తి లేదు, ఒక మార్పులేదు
మౌనంగా భరించే బాధకు ఒదార్పులేదు
అపాత్ర దానం కృతజ్ఞత లేని కొలువు
పేరు ప్రఖ్యాతులులేని వెట్టిచాకిరికి ప్రతిరూపం మెట్టు
మరి మెట్టు నా అదర్శం అనుకోమంటే వప్పుకుంటానా!?